



దగదర్తి విమానాశ్రయంపై మళ్లీ ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వంలో అడుగంటిన ఆశలు చంద్రబాబు ప్రభుత్వంలో మళ్లీ పురుడు పోసుకున్నాయి. ఈ విమానాశ్రయాన్ని తొలి ప్రాధాన్యతగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో నెల్లూరీయుల చిరకాలవాంఛ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి.

# ఆకాశయానంపై మళ్లీ ఆశలు

**తొలి ప్రాధాన్యం కింద దగదర్తి విమానాశ్రయం పూర్తి**

**నెల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):** సుదీర్ఘ సముద్రతీరం ఉన్న నెల్లూరు జిల్లా వ్యవసాయంతోపాటు పారి శ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో నెల్లూరులో విమానాశ్రయం స్థాపించాలనే ప్రతిపాదన 2007లో వచ్చి నా కార్యరూపం దాల్చలేదు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక తొలి అడుగుపడింది. తిరుపతి, చెన్నై, నెల్లూరు నగరాలను ట్రైసిటీగా అభివృద్ధి చేయాలనే సంకల్పంలో భాగంగా అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు నెల్లూరులో విమానాశ్రయం ఏర్పాటుకు నిర్ణయించారు. అందుకోసం నెల్లూరు- కావలి జాతీయ రహ దారిపై ఉన్న దగదర్తి మండలం దామవరం వద్ద 1,379 ఎకరాలను సేకరించారు. పట్టా భూములు ఎకరానికి రూ.18లక్షలు, సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములకు రూ. 13 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 1,060 ఎకరాల భూములను రైతులు ప్రభుత్వానికి అప్పగించారు. 2019 జనవరిలో సీఎం హోదాలో చంద్రబాబు విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు మొదలయ్యాయి. రన్‌వేకి సంబంధించిన ఎర్త్ వర్క్ కూడా కాంట్రాక్టర్లు మొదలు పెట్టారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో విమానాశ్రయానికి బ్రేకులు పడ్డాయి.

**● జిల్లావాసులకు జగన్ షాక్**

2019 ఎన్నికల్లో వైసీపీకి బ్రహ్మరథం పట్టిన నెల్లూరు జిల్లా ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి భారీ షాక్ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో మొదలైన అభివృద్ధి పనులను అటకెక్కించే క్రమంలో దగదర్తి విమానాశ్రయం నెత్తిన చెత్త వేశారు. దీంతో విమానాశ్రయం పనులు ఆగిపోయాయి. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు వెనక్కు వెళ్లిపోయారు. నాలుగేళ్లపాటు నాన్చి... నాన్చి నెల్లూరులో విమానాశ్రయాన్ని రద్దు చేస్తున్నట్లు జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఈ విమానాశ్రయాన్ని ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో నెల్లూరు జిల్లా వాసుల చిరకాల కోరిక అడుగంటిపోయింది.

**● బాబు రాకతో..**

చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో మళ్లీ దగదర్తి విమానాశ్రయంపై ఆశల చిగురించాయి. చెన్నై మహానగరానికి అనుసంధానం చేస్తూ తిరుపతి-నెల్లూరు నగరాలను ట్రై సిటీగా అభివృద్ధి చేయాలనే చంద్రబాబు బలమైన సంకల్పం మళ్లీ ప్రాణం పోసుకుంది. ఈ క్రమంలోనే విమానాశ్రయం నిర్మాణానికి చంద్రబాబు సిద్ధమయ్యారు. దగదర్తి విమానాశ్రయాన్ని మొదటి ప్రాధాన్యత కింద పూర్తి చేయాలని, అందుకు అవసరమైన పనులు మొదలు పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశించారు. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే రెండేళ్లలో విమానాశ్రయం పనులు పూర్తి అవుతాయి. నెల్లూరుజిల్లా వాసుల కల నెరవేరుతుంది.



దామవరం వద్ద విమానాశ్రయం ప్రతిపాదిత ప్రాంతం

# అటవీ భూముల్లో ఇసుక రవాణా

**● అక్రమార్కులకు అధికారుల పరోక్ష సహకారం**

**ఉలవపాడు :** మండలంలోని చాకిచర్ల పంచాయతీ పరిధిలోని చినపట్టపుపాలెం, పెదపట్టపుపాలెం పంచాయతీ పరిధిలోని అటవీ శాఖ భూముల్లో విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉన్న టైరుబండ్లు (ఎడ్లబండ్లు) యజమానులు అటవీ శాఖ అధికారులకు నెల మామూళ్లు ఇచ్చి బహింగ్‌హాం కాలువకు సమీపాన ఇసుకను తోడేస్తున్నారు. పల్లెపాలెం గృహాల సమీపంలో ఇసుక మేటలను కొల్లగొట్టి అక్రమంగా తరలిస్తున్నారని ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో భవన నిర్మాణాలకు ఫారెస్టు భూముల్లో నాణ్యమైన ఇసుక దొరుకుతుండటంతో వాగులు, వంకలు, ఏరుల్లో లభ్యమయ్యే ఇసుకతో అవసరం లేకుండా పోయింది. అదీగాక దూర ప్రాంతాల నుంచి ఇసుక కొనుగోలుకు అధిక మొత్తం వెచ్చించాల్సి రావడంతో తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే ఫారెస్టు ఇసుకపైనే భవన నిర్మాణదారులు మొగ్గు చూపారు. ఇంకేముంది.. కొందరు ట్రాక్టర్లతో కాకుండా ఎడ్లబండ్లతో గుట్టుచప్పుడు కాకుండా ఒక బండి ఇసుక డిమాండును బట్టి రూ.1000 వరకు కూడా అమ్ముతున్నారని సమాచారం. చిన్నపట్టపుపాలెం నుంచి పల్లెపాలెం వరకు బహింగ్‌హాం కాలువ గట్టు పొడవున ఇసుక తీసిన గోతులు దర్శనమిస్తున్నాయి. అయితే, ఇదంతా ఫారెస్టు అధికారులకు తెలియకుండా జరగలేదని తొలుత అడపాదడపా దాడులు చేసి ఆ తర్వాత వాళ్లతో చేతులు కలిపి ఇసుక రవాణాకు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



ఫారెస్టు భూముల్లో ఇసుక కోసం విచ్చలవిడిగా తవ్విన గోతులు



వైసీపీ ప్రభుత్వంలో జిల్లా నుంచి ఇసుకను చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు చేరవేస్తూ రూ.కోట్లు గడించిన మాఫియాకు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రేకులు పడ్డాయి. గడిచిన రెండు నెలలుగా మాఫియా తన అక్రమ వ్యాపారాలను నిలిపేసింది. అయితే, ఈ రెండు నెలల్లో అధికార యంత్రాంగాన్ని దారిలోకి తెచ్చుకున్న మాఫియా మళ్లీ అక్రమ రవాణాను ప్రారంభించింది. గడిచిన వారం రోజులుగా నిత్యం పదుల సంఖ్యలో భారీ లారీల ద్వారా ఇసుకను జిల్లా దాటించేస్తోంది. ఒక లారీ ఇసుకను చెన్నైలో అన్‌లోడ్ చేస్తే రవాణా ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం మిగులుతున్నట్లు తెలుస్తోంది. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా ఈ మొత్తంలో సెబ్, పోలీసులకు కొంత ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# మళ్లీ మాఫియా!

**● దర్జాగా చెన్నైకి ఇసుక అక్రమ రవాణా ● మాఫియా లీడర్‌గా బుచ్చి మండల వ్యాపారి**

**● దొంగ బిల్లులతో దర్జాగా తరలింపు ● నెలమామూళ్లతో అధికారుల కునుకు**

**నెల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) :** ప్రస్తుతం జిల్లాలో అధికారికంగా ఇసుక రీచ్‌లు నడవడం లేదు. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో తవ్వకాలు నిలిచిపోగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం యార్డుల్లోని ఇసుకను ప్రజలకు అందిస్తోంది. అయితే ఇసుక మాఫియా మాత్రం రాత్రివేళల్లో పెన్నా నదిలో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు జరిపి ఓ చోట డంప్ చేసుకుంటోంది. అక్కడ నుంచి ఒక్కో లారీలో 50 టన్నులకుపైగా ఇసుకను చెన్నైకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఈ లారీలన్నీ రోడ్డు మీదకు వస్తున్నట్లు అంతర్గత వర్గాల ద్వారా తెలుస్తోంది. వేకువజామున ఐదు గంటల కంతా చెన్నై రెడ్‌హిల్స్ దగ్గర అన్‌లోడ్ చేసేస్తున్నట్లు సమాచారం. బుచ్చిరెడ్డి పాళెం మండలానికి చెందిన ఓ ఇసుక వ్యాపారి ఈ అక్ర మ రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఈ వ్యక్తే అడ్డూ అదుపూ లేకుండా దోచుకు న్నారని ప్రచారం జరుగుతోంది. చెన్నైకు ఇసుక అక్రమ రవాణా చేసేవారందరికీ ఈయనే ముందుండి పోలీసు స్టేషన్లను మేనేజ్ చేస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆయన తన పంథాను మార్చుకోలేదు. విషయం తెలుసుకున్న మైనింగ్ అధికారులు బుచ్చి మండలం కాగులపాడు పెన్నా ఒడ్డున భారీ ఇసుక డంప్‌ను గుర్తించారు. ఆ ఇసుకను సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు కూడా పెట్టారు. అప్పటి నుంచి కొన్నాళ్లు స్థానికంగానే ఇసుక వ్యాపారం చేసిన ఈ వ్యక్తి మళ్లీ అక్రమార్కులను సిండికేట్ చేసినట్లు తెలుస్తోంది. పోలీసు, సెబ్‌ను మేనేజ్ చేసుకున్నప్పటికీ మైనింగ్ అధికారులు పట్టుకుంటే ఇబ్బందులు తప్పవని భావించిన ఈ మాఫియా దొంగ బిల్లులతో ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. తడ వరకు ఇసుక పేరుతో దొంగ బిల్లులు పెట్టుకోవడం, అక్కడ నుంచి సిలికా పేరుతో దొంగ బిల్లులు పెట్టుకొని చెన్నై వరకు తీసుకెళ తున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా మళ్లీ అక్రమ రవాణా మొదలవడంతో సమాచారం సేకరించిన ఇంటెలిజెన్స్ వర్గాలు ఉన్నతాధి కారులకు నివేదించాయి. కానీ ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసు, సెబ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రతి నెలా ఠంచనుగా ప్రతి పోలీసు స్టేషన్‌కు మామూళ్లు కడుతున్నట్లు ఆ మాఫియా వర్గాలే బహిరంగంగా చెప్పుకుంటుండటం గమనార్హం. ఈ మాఫియాకు ఆదిలోనే బ్రేక్ వేయకపోతే భవిష్యత్‌లో మరింత మంది ఈ ఇసుక అక్రమ రవాణా వ్యాపా రంలోకి దిగే ప్రమాద ముందన్న అభి ప్రాయం వ్యక్తమవుతోంది.

**కఠిన చర్యలు తప్పవు**

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుతం నదిలో తవ్వకాలకు ఎక్కడా అనుమతులు లేవు. కేవలం మన్రిపాడు యార్డులో మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయి. అక్రమ తవ్వకాలపై నిఘా ఉంచాం. అన్ని శాఖలతో కూడిన టాస్క్‌ఫోర్స్ కూడా పనిచేస్తోంది. ఇటీవల కాగులపాడులో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసి కేసు కూడా పెట్టాం. అలానే పోలీసు శాఖ అక్రమ రవాణాపై 25 ఎఫ్ఐఆర్‌లు కూడా కట్టింది.

**- శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ**



నేత కార్మికులను సన్మానిస్తున్న చేనేత సంఘాల నాయకులు

# జీఎస్టీ ఎత్తేయాలి!

**● గిట్టుబాటు ధర కల్పించండి**

**● జిల్లాలో నేత బజారును ఏర్పాటు చేయాలి**

**● జాతీయ చేనేత దినోత్సవ సభలో నాయకులు**

**నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 7 :** చేనేతలను ఆర్థికంగా కుంగదీస్తున్న జీఎస్టీని తొలగించాలని చేనేత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు బుధవరపు బాలాజీ, కాసా శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య దవాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్యం సతీష్ తదితరులు మాట్లాడారు. గిట్టుబాటు ధర కల్పించాలని, జిల్లాలో నేత బజార్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా సబ్సిడీతో రంగులు, రసాయనాలు, నూలు అందించాలని డిమాండ్ చేశారు. చేనేతల సమస్యలపై కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వారిని అభివృద్ధి పథంలో నడిపించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. హ్యాండ్లూమ్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 11 రకాల చేనేత వస్త్రాలను హ్యాండ్లూమ్ మీదే తయారయ్యేలా ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నగరంలోని ఆప్కో స్థలాన్ని చేనేత వర్గాలకు కేటాయించి నేత బజారు, కల్యాణ మండపం, చేనేత కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం కేంద్ర కమిటీ సభ్యులు రామనాథం రాజశేఖర్, పెంచలయ్య, కొప్పర్తి హరినాథ్, గుత్తికొండ వెంకయ్య, ఏఐడబ్ల్యూఎఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు శేషయ్య, పద్మశాలి యువసేన ప్రతినిధి మునగపాటి రమేష్, పమజుల ప్రదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులను సన్మానించారు.



గాంధీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

**● చేనేతల అభివృద్ధికి కృషి : కలెక్టర్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన చేనేత కార్మికులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. టౌన్‌హాలు వరకు సాగిన ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ వరప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంటకయ్య, జిల్లా సహకార అధికారి గుర్రప్ప, చేనేత ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, దేవాంగ సమితి నాయకులు మన్నెం సతీష్, శంకయ్య, పమజుల రవి, చేనేత సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# యథాస్థానాలకు ఎంపీడీవోలు

**నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 7:** సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లా నుంచి వివిధ జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలందరినీ యథాస్థానాలకు పంపాలని బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికలకు ముందు జిల్లాలో పనిచేస్తున్న 32మంది ఎంపీడీవోలను చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, కడప జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల కోడ్ ముగిశాక ప్రభుత్వం వారిని వెనక్కు పంపాల్సి ఉంది. ఈ క్రమంలో వారిని యథాస్థానాలకు పంపాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఒకటి, రెండు రోజుల్లో స్వస్థలాలకు ఎంపీడీవోలు రానున్నారు.

# ‘ఉపాధి’ కూలి ఇప్పించండి సారూ!

**● రెండు నెలలుగా అందని వేతనం**

**● రూ.40 కోట్ల మేర బకాయిలు**

**● ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామీణ ప్రజానీకం**

**నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 7 :** 'కూలి డబ్బులు ఇప్పించండి మహాప్రభో..' అంటూ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలు అధికారులను వేడుకుంటున్నారు. రెండు నెలలుగా పనులు చేయడం తప్ప వేతనం ఇవ్వక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లావ్యా ప్తంగా సుమారు రూ.40 కోట్ల మేర బకాయిలు నిలిచి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వలస నివారణ కోసం స్థానికంగానే నిరుపేదలకు ఉపాధి కల్పించేందు కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఏడాదికి రూ.200 కోట్ల మేర పనులను అధికారులు చేయిస్తున్నారు. జిల్లాలో 3.33 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.15 లక్షల మంది కూలీలు ఉన్నారు. రోజుకు సుమారు లక్ష మంది ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటారు. వీరి ద్వారా చెరువులు, పంట పొలాలు, కుంటలు, కాలువల్లో పూడికతీత వంటి పనులు చేయిస్తున్నారు. ఇలా పనులు చేసిన కూలీలకు ప్రతి వారం వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది. అయితే, మే నెల 21వ తేదీ వరకు వేతనాలు మంజూరు కాగా ఆ తర్వాత నుంచి నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తదితర కారణాలతో వేతనాలు ఆగినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కారణాలు ఏవైనా రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దీనిపై పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరయ్యేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.

**త్వరలోనే వేతనాలు ఇస్తాం**

ఉపాధి హామీ పథకం బిల్లులకు సంబంధించి ఇప్పటికే నివేదికలను ప్రభుత్వానికి పంపాము. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. నిధులు రాగానే కూలీలకు పూర్తి వేతనాలు అందించడం జరుగుతుంది.

**- వెంకట్రావు, డ్వామా పీడీ**



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)



నెల్లూరులోని స్కానింగ్ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు (ఫైల్)

# లింగ నిర్ధారణ పరీక్షలపై కొరడా

**వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలని వైద్యశాఖ ఆదేశం**

**నిబంధనలు అతిక్రమిస్తే రూ.30వేల వరకు జరిమానా**

**నెల్లూరు (వైద్యం), ఆగస్టు 7 :** గర్భిణుల కడుపులో ఉన్న నవజాతా శిశువుల ఆరోగ్య పరిస్థితిని మాత్రమే గుర్తించేందుకు ఏర్పాటైన స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ కొరడా ఝులిపిస్తోంది. దేశంలో భ్రూణ హత్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పూర్తిగా నియంత్రించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం జారీ చేసింది. ఈ మేరకు ఆయా కేంద్రాల్లో స్కానింగ్ చేసిన వారి వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో పొందు పరచాల్సి ఉంటుంది. ఫాం ఎఫ్ కింద పీసీపీఎన్ డీటీ వెబ్ సైట్‌లో ఆ వివరాలన్నీ నమోదు చేయాలి. జిల్లాలో 200 వరకు స్కానింగ్ కేంద్రాలు ఉండగా, ఈ కేంద్రాలల్లో చేసే స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు. కొన్ని మాత్రమే ఫాం ఎఫ్‌ను నమోదు చేస్తున్నాయి. ఈ క్రమంలో వైద్యాధికారులు ఆయా స్కానింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టారు. విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ పలు హెచ్చరికలు జారీ చేస్తున్నది. అయినా ఇంకా పలు స్కానింగ్ కేంద్రాలు ఆన్‌లైన్‌లో వివరాలు మాత్రం ఉంచడం లేదు. గతంలో పుస్తకాల్లో స్కానింగ్ వివరాలు నమోదు చేసి వైద్య ఆరోగ్యశాఖలోని డెమో విభాగంలో అప్పగించే వారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పరిస్థితిలో అన్ని స్కానింగ్ కేంద్రాలకు అధికారులు నోటీసులు పంపించారు.

**● జరిమానా తప్పదు!**

పూర్తిస్థాయిలో స్కానింగ్ చేయని కేంద్రాల నిర్వాహకులు భారీ ఎత్తున జరిమానా కట్టాల్సి ఉంటుంది. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు రూ.25వేల నుంచి 35వేల వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. ఇలా జిల్లాలోని 176 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం వివరాలు నమోదు చేసుకోవటం లేదన్న వాదన వినిపిస్తోంది. అలా నమోదు చేసుకోని స్కానింగ్ కేంద్రాలపై రిజిస్ట్రేషన్ ఫీజుకు ఐదురేట్లు జరిమానా వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

● అగ్రి వర్సిటీ అధికారి ప్రమీలరాణి ● కేవీకేలో స్వర్ణోత్సవం



స్వర్ణోత్సవ జ్యోతితో శాస్త్రవేత్తలు, రైతులు

**నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 7 :** రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకురాలు డాక్టర్ ప్రమీలరాణి పిలుపునిచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రా(కేవీకే)లు స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని కేవీకేలో సమ న్వయకర్త డాక్టర్ లలితాశిజ్యోతి ఆధ్వర్యంలో బుధవారం స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహిం చారు. ఇందులో పాల్గొన్న ప్రమీలరాణి మాట్లాడుతూ నెల్లూరులో కేవీకే స్థాపించి 25ఏళ్లు అయిందని, రైతుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని అన్నారు. అనంతరం ప్రకృతి వ్యవ సాయం చేస్తున్న రైతులకు కషాయాలు తయారు చేసుకునేందుకు డ్రమ్ములను పంపిణీ చేశారు. నిమ్మ పంటను సాగుచేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులు ఏర్పాటు చేసుకున్న సం ఘాలకు స్ప్రేయర్లు, ఆక్వా రైతులకు ఏరేటర్లు అందజేశారు. ఈ కార్యక్ర మంలో అగ్రి వర్సిటీ ఉప విస్తరణ సంచాకుడు డాక్టర్ బీ ముకుందరావు, సదరన్ జోన్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ వీ సుమతి, డాక్టర్ ఓబయ్య, వినీత, రైతు సంఘాల నాయకులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## రేపు మంత్రి సత్యకుమార్ రాక

**నెల్లూరు, (స్టోన్ హౌస్ పేట), అగస్టు 7:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకు మార్ యాదవ్ శుక్రవారం నెల్లూరులో పర్యటించను న్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఈనెల 9న ఉదయం 9 గంటలకు మెడికవర్ వైద్యశాల వద్ద నగరంలోకి ప్రవేశిస్తారని తెలిపారు. 9.30 నిమిషాలకు జీజీహెచ్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారని, 10 గంటలకు కిలారు తిరు పతి నాయుడు కల్యాణ మండపంలో జరిగే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని వివరిం చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు బీజేపీ కార్యకర్త గృహప్రవేశానికి హాజరవుతారని, అనం తరం జీజీహెచ్‌లో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. సాయంత్రం ఐదు నుంచి 7 గంటల వరకు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఉంటారని, సమస్యలు చెప్పుకునేవారు కలవవచ్చని తెలిపారు. అనంతరం నగరంలోని ఓ వివాహానికి హాజరై రాత్రి 8 గంటలకు ధర్మవరం బయలుదేరుతారని వివరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు కందికట్ల రాజే శ్వరి, మిడతల రమేష్, గడ్డం విజయ్‌కుమార్, ఎర్రబోలు రాజేష్, నరసింహనాయుడు, పెంచ లయ్య, రాఘవేంద్ర, దాసరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణభయం అంటూ జగన్ దొంగ నాటకం!

- ఆయన చంచల్‌గూడ జైలులో ఉండటమే మంచిది
- దళితులను పొట్టనపెట్టుకున్న ఘనత వైసీపీదే!
- వారికి పదవులు ఇచ్చిన ఘనత చంద్రబాబుది
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

**నెల్లూరు (వైద్యం) :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి జగన్మో హన్‌రెడ్డి ప్రాణ భయం అంటూ దొంగ నాటకా లు ఆడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. బుధవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ బయట తిరగడం కంటే చంచల్‌గూడా జైలులోనే ఉండటం మంచిదని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలో ఉండగా ఎందరో దళితులను పొట్టన పెట్టుకున్నారంటూ మండిపడ్డారు. దళిత మహిళలపై అత్యాచారాలు చేసి హత్య చేసిన చరిత్ర జగన్ ప్రభుత్వానిదేనని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో జరిగిన నేరాలలో 65 శాతం అత్యాచారాలనేనని వెల్లడించారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా చిత్రీకరించి హత్య చేశారన్నారు. దళిత యువకుడ్ని డోర్ డెలివరీ చేసిన ఘనత ఎమ్మెల్సీ అనంతబాబుదేనని విమర్శించారు. పులివెందులలో దళిత యువతిని అత్యాచారం చేస్తే నిందితులను ఇంతవరకు పట్టుకోక పోవటం జగన్ అసమర్థతకు నిదర్శనమన్నారు. చిన్నాన్న హత్య కేసులో అవినాష్‌రెడ్డిని కాపాడేందుకు ఢిల్లీ వెళ్లిన జగన్ ఒక్కనాడైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ వెళ్లారా!? అంటూ ప్రశ్నించారు. ప్రతిభా భారతి, బాలయోగి వంటి దళితులకు అత్యున్నత పదవులను ఇచ్చిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుదేనని గుర్తు చేశారు. ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిన చరిత్ర జగన్‌ది కాగా దళితుల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకు వచ్చిన చరిత్ర చంద్రబాబుదేనని వెల్లడించారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు మామిడాల మధు, కువ్వారపు బాలాజీ, ప్రశాంత్, మొయిద్దీన్, జాకీర్, ఆకుల హనుమంతరావ్, గురు, సుధాకర్‌రాజు, మహేష్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో చోరీ



చిందరవందరగా పడేసిన బీరువాలోని దుస్తులు

**ఆత్మకూరు, ఆగస్టు 7:** పట్టణంలోని జేఆర్‌పేటలోని లాయర్ నజీర్‌వీధిలో నివా సమున్న బండి నరసింహ రావు ఇంట్లో చోరీ జరిగి నట్లు బుధవారం వెలుగు లోకి వచ్చింది. కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి సొంతూరుకు వెళ్లారు. బుధవారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు పగుల గొట్టి ఉన్నట్లు గమనించాడు. అంతేకాదు బీరువాలోని బట్టలు చిందరవందరగా పడిఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బీరువాలో ఉన్న నాలుగు వెండి కాయన్లు, రెండు చిన్నపిల్లల బంగారు ఉంగరాలు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాలరావు తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తూ దొరికిన కాడికి తీసుకెళ్తున్నారు. మూడు రోజుల క్రితం పట్టణంలోని జేఆర్‌పేటలో జరిగిన చోరీలో 16 సవర్ల బంగారు నగలు అపహరణకు గురైన విషయం విదితమే. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాత్రి పోలీసులు గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జామాయిల్ కర్ర తరలింపు లారీ స్వాధీనం

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 7:** కొండాయపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వరా బాదు గ్రామ సమీపంలో ప్రభుత్వ భూముల్లో సాగు చేసిన జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్న లారీని బుధవారం అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. వివరాల మేరకు.. రెవెన్యూ పరిధిలోని 1284 సర్వే నెంబర్‌లోని ఎకరం ప్రభుత్వ భూమిలో గత కొన్నేళ్ల క్రితం కొం దరు జామాయిల్ సాగు చేపట్టారు. ఆ చెట్లను నరికి గుట్టుచప్పుడు కాకుండా లారీలో తరలిస్తుండడంతో గ్రామస్థులు కొందరు గుర్తించి వీఆర్వో వెంకట్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసు, అటవీ శాఖాధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని లారీని స్వాధీనం చేసుకొన్నారు. అలాగే మండలంలోని తిరు మలాపురం గ్రామ సమీపంలోని రైతులు, అగ్రిగోల్డ్‌కు సంబంధించిన అక్రమంగా జామాయిల్ చెట్లను నరికి తరలిస్తున్నారని సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి విచారణ చేపట్టారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 90 |
| లేయర్ లైవ్ | 90 |
| స్కిన్ చికెన్ | 176 |
| స్కిన్‌లెస్ | 196 |
| లేయర్ | 153 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.6554 |
| వెండి కిలో ధర | రూ. 81,300 |
| వెండి ఒక గ్రాము | రూ. 83.30 |

## గిరిజన యువతకు డీఎస్సీలో శిక్షణ

**నెల్లూరు(హరనాథపురం) :** గిరిజన సంక్షేమశాఖ ఆదేశాల ప్రకారం జిల్లాలో 150 మంది గిరిజన యువ తీ యువకులకు డీఎస్సీలో ఉచితంగా శిక్షణ ఇస్తామని ఐడీడీఏ పీవో పరిమళ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణతోపాటు భోజన వసతి కూడా ఉంటుందన్నారు. అర్హులు ఈ నెల 13వతేదీ సాయం త్రం 5 గంటల్లోగా నెల్లూరులోని సమీకృత గిరిజనాభి వృద్ధి సంస్థ(యానా దులు) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరా రు. పూర్తి వివరాలకు కార్యాలయం లోగానీ, 8187899877 నెంబరును గానీ సంప్రదించాలన్నారు.

# జిల్లాను కమ్మేసిన వైరల్ ఫీవర్

- 10వేలకుపైగా కేసుల నమోదు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- బాధితులతో ఆసుపత్రిలన్నీ కిటకిట
- వ్యాప్తికి సీజన్ కావటంతో జాగ్రత్తలు పాటించాలి



ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో జ్వరపీడితులు

**నెల్లూరు(వైద్యం) ఆగస్టు 7 :** వాతా వరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్ కనిపిస్తోంది. జ్వరపీడితులు వివిధ ఆసు పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్థుల్లో వైరల్ ఫీవర్ కేసులే 40 శాతం ఉంటున్నా యంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకో వచ్చు. ఏ గ్రామంలో చూసినా జ్వరాలే. స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యులను ప్రతిరోజూ పదుల సంఖ్యలో జ్వరపీడితులు కలుస్తూ చికిత్స చేయించుకుంటున్నారు.

● **10 వేలకుపైగా కేసులు**

జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉండగా గత వారంలో ఆయా పీహెచ్‌సీలకు 300 మందికిపైగా జ్వర పీడితులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇక ఏరియా, జిల్లా ఆసుపత్రులతోపాటు, నెల్లూరులోని జీజీహెచ్‌లో రోజు రెండువేలకు మందికి పైగా వివిధ రకాల రోగులు వస్తుండగా, ఇందులో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారు. ఇక జిల్లాలో రెండువేలకుపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా ఇక్కడకు వచ్చే రోగులలో జ్వరాల వ్యాధిగ్రస్థుల సంఖ్య ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలో 26 లక్షల మంది జనాభా ఉండగా, ప్రస్తుతం 10వేలకు మందికిపైగా జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి వారం రాష్ట్రస్థాయి అధికారులతో జరిగే వీడియా కాన్ఫరెన్స్ లోనూ జిల్లాలో జ్వరాల ప్రభావంపై అధికారులకు హెచ్చరికలు జారీచేస్తున్నారు.

● **జ్వరం, గొంతు బాధితులే ఎక్కువ..**

జ్వరాల కేసుల్లో ఎక్కువగా జ్వరం, గొంతు నొప్పి కేసులే ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాటు ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు కూడా ఉన్నాయి. దీనికతోడు టైఫాయిడ్ కేసులు కూడా ఎక్కువగా ఆయా ఆసుపత్రు లకు వస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వాతావరణంలో వచ్చిన మార్పులు, పారిశుధ్య లోపంతోపాటు నీటి కలుషిత కారణంగా కూడా వైరల్ ఫీవర్ వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వర్షంలో తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ప్రత్యేకించి చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా వైరల్ జ్వరానికి గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో దాదాపు 15 శాతం మంది జ్వరాలతో బాధప డుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఎందరో నిరుపేదలు జ్వరాలకు, వివిధ రకాల పరీక్షలకు రూ.వేలు వెచ్చించాల్సి వస్తున్నది. స్వల్పంగా దగ్గు, జలుబు చేసినా అది వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు దారి తీసే అవకాశం ఉంది. ఈ క్రమంలో వైరల్ జ్వరాలు రాకుండా మాస్క్‌లు, చేతిరుమాలు నోటికి అడ్డం పెట్టుకోవాలి. జ్వరం కారణంగా కండరాల నొప్పులు కూడా వస్తున్నాయి.

**జాగ్రత్తలు ఇలా..**

- నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- వర్షంలో తడవకుండా ఉండాలి.
- లార్వా దశలోనే దోమల నివారణ మందులు వాడాలి.
- లార్వా ఉన్న నీటిలో వంద గ్రాముల కిరోసిన్‌ను పోస్తే అవి మరణిస్తాయి.
- నివాసాల్లో దోమతెరలు, దోమల నివారణ మందులు వాడుకోవాలి.
- ప్రత్యేకించి గ్రామాల్లో పారిశుధ్యం చర్యలు తీసుకోవాలి.
- దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి.
- స్వల్పంగా జ్వరం వచ్చినా వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి.

● **అవగాహనపై ప్రచారమేది ?**

వైద్య ఆరోగ్యశాఖ ప్రజారోగ్యం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా వ్యాధులపై మాత్రం అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందుతోంది. వ్యాధులపై అవగా హన కల్పించే అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ఉన్నారు. గ్రామీణ ప్రాం తాల్లో సైతం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నారు. అయితే చి న్నపాటి జ్వరాలపై కూడా ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫల మవుతున్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు హెచ్చరికలు చేయా ల్సిన వైద్యశాఖ ఆ దిశగా కృషి చేయడంలేదన్న విమర్శలున్నాయి. ప్రత్యేకించి ఈ సీజన్‌లో డిసెంబరు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దోమల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు.

**బాధితులు ఎక్కువగా ఉన్నారు**



ప్రస్తుతం జ్వరాల బాధితులు పెద్ద సంఖ్యలో నమో దవుతున్నారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులలో వీరే ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం టైఫాయిడ్ కేసులు కూడా నమోద వుతున్నాయి. తప్పనిసరిగా జ్వరాలకు సంబంధించి అన్ని రకాల పరీక్షలు చేయించుకుంటే అది ఎలాంటి వైరల్ ఫీవరో తెలుస్తుంది. దీనికి అనుగుణంగా చికిత్స అందిస్తున్నాం.

**- డాక్టర్ గంగాధర్, జీజీహెచ్, అసోసియేట్ ప్రొఫెసర్**

**గొంతు నొప్పిపై నిర్లక్ష్యం వద్దు**



జిల్లాలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల గొంతునొప్పితోపాటు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం అధికంగా ఉంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా అది సాధారణ జ్వరమా, కాదా అన్న కోణంలోనూ పరీక్షలు చేయించుకోవాలి. ప్రస్తుత వాతారణ పరిస్థితిలో బయట ఆహారం తీసుకోరాదు. చిన్నపిల్లల, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**- డాక్టర్ ప్రభంజన్ కుమార్ గంగా, ఈఎన్‌టీ వైద్య నిపుణులు, పద్మావతి ఆసుపత్రి**

## నేడు వెంకయ్య రాక

● ఈనెలలోనే రెండుసార్లు పర్యటన ● 17న ఉప రాష్ట్రపతి జిల్లాకు రాక

**వెంకటాచలం, ఆగస్టు 7:** పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు గురు వారం జిల్లాకు రానున్నారు. ఈనెల 10వతేదీ వరకు జిల్లాలోనే ఉంటారు. తిరిగి ఈ నెల 14న ఆయన మరోసారి పర్యటనకు వచ్చి 19వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనను న్నారు. ఈ మేరకు పర్యటన ఖరారైందని పూర్వ ఉపరాష్ట్రపతి కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈనెల 8న (నేడు) విమానంలో తిరుపతికి, అక్కడ నుంచి రైలు మార్గాన నెల్లూరుకు చేరుకుంటారు. 9న గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో జరిగే ఏ శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సీ రాధాకృష్ణారెడ్డిల విగ్రహావిష్కరణలో పాల్గొం టారు. అనంతరం డాక్టర్ సీఆర్ రెడ్డి జీవన ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. 10న వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ అడ్మిన్ బ్లాక్ పూజా కార్యక్రమంలో పాల్గొం టారు. అనంతరం రైలులో చీరాలకు వెళ్తారు. 13వతేదీ వరకు చీరాల, గుంటూరు, విజయ వాడల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి ఈనెల 14న రైలులో నెల్లూరుకు చేరుకుంటారు. 15న అక్షర విద్యాలయంలో జరిగే స్వాతంత్ర్య సంబరాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. 16న నెల్లూరు టౌన్‌హాల్‌లో శ్రీపోలూరి హనుమజ్జానకి రామశర్మ శత జయంతి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. 17న ఉపరాష్ట్రపతి జగ్ దీప్ ధన్‌ఖడ్‌తో కలిసి స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ సేవా ప్రస్థాన ంలో వెంకయ్య పాల్గొంటారు.ఈ నెల 19న హైదరాబాద్‌కు తిరిగి వెళతారని ఆయన కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

## బిట్రగుంట రైల్వేను అభివృద్ధి చేయండి

● రైల్వే మంత్రికి ఎంపీ వేమిరెడ్డి వినతి



రైల్వేమంత్రికి లేఖను అందచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7 :** జిల్లాలోని బిట్రగుంట రైల్వే సెంటర్‌ను అభివృద్ధి చేయాలని నెల్లూరు ఎంపీ వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో మంత్రిని కలిసి లేఖను అందించారు. బ్రిటీష్ హయాంలో బిట్ర గుంట రైల్వే స్టేషన్‌కు చాలా ప్రాధాన్యత ఉండేదని, మినీ ఇంగ్లాండ్‌గా ప్రసిద్ధి చెందిందని తెలియజేశారు. ఆ రైల్వే కేంద్రం అభివృద్ధితో జిల్లాతోపాటు రాష్ట్రానికి కూడా ఆదాయం వస్తుందని వివరించారు. వేమి రెడ్డి వినతికి రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారు.

**ఏపీలో అమృత్ భారత్ గురించి వివరించండి ?**

అమృత్ భారత్ స్టేషన్ పథకం గురించి వివరించాలని బుధవారం లోక్ సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇందుకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానమిస్తూ రైల్వే స్టేషన్లలో సౌకర్యాల మెరుగుదల కోసం అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని రైల్వే శాఖ ప్రారంభించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 73 స్టేషన్లను ఈ పథకం కింద అభివృద్ధి చేయడానికి గుర్తించినట్లు వివరించారు.

## ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

ఇన్‌చార్జి కలెక్టర్ సూర్యతేజ



ర్యాలీలో జాతీయ జెండాలతో ఇన్‌చార్జి జేసీ, అధికారులు

**నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7 :** దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భం గా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండా ను రెపరెపలాడించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నెల్లూరులోని వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరగ నున్న హర్‌ఘర్ తిరంగా మహోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేసే కార్య క్రమాలను రూపొందించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పెంచలయ్య, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఆర్డీవో మలోల, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**సహకార బ్యాంకును లాభాల బాటలో నడిపించాలి**

జిల్లా కేంద్ర సహకార బ్యాంకును లాభాల బాటలో నడి పించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ అధికా రులకు సూచించారు. బుధవారం ఆ బ్యాంకు మహాజనసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల సభ్య రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మెరుగైన సేవలు అందించాలన్నారు. విరివిగా రుణాలు మంజూరు చేయాల న్నారు. నష్టాలలో ఉన్న 51 పీఏసీఎస్‌లను లాభాల బాటలో నడిపించడానికి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశిం చారు. వాటిలో ఎరువుల వ్యాపారం జరపాలన్నారు. వాయి దా తీరిన బకాయిలను రాబట్టడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 2047 విజన్ డాక్యుమెం టరీకి అనుగుణంగా పీఏసీఎస్‌ల విజన్ డాక్యు మెంటరీని తయారు చేయాలంటూ దిశానిర్దేశం చేశారు. ఈ సమా వేశానికి ముందు డీసీసీబీ నుంచి గాంధీబొమ్మ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సహకార శాఖాధికారి గురప్ప, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, జీఎం సరిత పాల్గొన్నారు.

## మెట్టు రామచంద్ర ప్రసాద్‌కి అవార్డు


● 16న నెల్లూరులో ప్రదానం



రామచంద్ర ప్రసాద్‌ను సత్కరిస్తున్న జర్నలిస్టులు, సాహితీ అభిమానులు

**నెల్లూరు (సాంస్కృతికం) :** పద్య కళా పరిషత్ వ్యవస్థాప కుడు మెట్టు రామ చంద్రప్ర సాద్‌కు తెలంగాణ సార స్వత పరిషత్ పోలూరి హను మజ్జానకీ రామశర్మ పురస్కా రానికి ఎంపిక చేసింది. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు గురువు అయిన హనుమజ్జానకీ రామశర్మ పేరిట తెలంగాణ సారస్వత పరిషత్ నుంచి ఈ అవార్డును ఏర్పాటు చేశారు. ఏటా రామశర్మ జయంతి రోజున పురస్కారాన్ని అందజేస్తున్నా రు. ఈ నెల 16న నెల్లూరు పురమందిరంలో ఈ పురస్కారాన్ని మెట్టు రామచంద్రప్రసాద్‌కు ప్రదానం చేయనున్నారు. ముఖ్య అతిథిగా వెంకయ్యనాయుడు హాజరవుతున్నారు. మెట్టు రామచంద్రప్రసాద్ కూడా రామశర్మ శిష్యుడే. రామశర్మ పనిచేసిన వీఆర్ కళాశాలలో రామ చంద్రప్రసాద్ తెలుగుశాఖ అధ్యక్షుడిగా ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకుపో యారు. కాగా, అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో బుధవారం భారత ప్రభుత్వ క్షేత్రప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి మర్యాదపూర్వకంగా మెట్టు రామచంద్రప్రసాద్‌ను కలిసి అభినందించారు. సాహితీకారులు, వివిధ సంఘల వారు కూడా అభినందనలు తెలిపి సత్కరించారు.

## కృష్ణపట్నం పోలీస్ కేసు కొట్టివేత



**నెల్లూరు (లీగల్), ఆగస్టు 7 :** విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేశారన్న కేసులో నేరం రుజువు కాకపోవడంతో 11 మందిపై కేసు కొట్టివేస్తూ నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పాలమంగళం వినోద్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసి క్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2019 మార్చి 4వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలో ఎలాంటి నేరాలు జర గకుండా చూసేందుకు పోలీసు సిబ్బంది ఎం రమేష్ బాబు, ఈ వెంకయ్య ఉన్నతాధికా రులు బందోబస్తు విధులు అప్పగించారు. అయితే పాట కచేరీ జరుగుతున్న సమయంలో గ్రామానికి చెందిన వాటంబేటి ప్రభాకర్ అనే వ్యక్తి వేదిక మీదకు ఎక్కి పోలీసుల విధులకు భంగం కలిగించాడు. ప్రభాకర్‌ను స్టేజ్ నుంచి దించుతుండగా పోలీసు సిబ్బంది రమేష్‌పై అతను దాడి చేశాడని అభియోగం. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా ఆ గ్రామానికి చెందిన ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ రాగాల వెంకటేశ్వర్లు తన అనుచరులతో వచ్చి ప్రభాకర్‌ను పోలీసు కస్టడీ నుండి తీసుకుని వెళ్లాడని మరో అభియోగం. ఈ క్రమంలో ప్రభా కర్, రాగాల వెంకటేశ్వర్లుతోపాటు మరో 9 మందిపై కృష్ణపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అయితే కోర్టులో నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. నిందితుల తరపున న్యాయవాది పీసీ కృష్ణయ్య వాదించారు.

## బాలిక అపహరణ కేసులో నిందితులకు మూడేళ్ల జైలు

**కోవూరు, ఆగస్టు 7:** కొడవలూరు మండల పరిధిలోని నార్తురాజుపాలెం గ్రామానికి చెందిన ఓ బాలికను అపహరించిన కేసులో నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి కాత్యాయిని బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... గత ఏడాది ఆగస్టు 8న నార్తురాజుపాళెం గ్రామంలోని కొండూరువారి వీధికి చెందిన ఓ బాలిక ఇంట్లో ఆడుకుంటుండగా సంగం గ్రామానికి చెందిన దొడ్ల వెంకటరమణమ్మ, చీరాల పట్టణానికి చెందిన ఆవుల రాజవేలు అపహరించారు. ఇంట్లో వస్తువుల్ని దొంగిలించారు. కాగా, బాలిక అపహరణపై అప్పటి ఎస్ఐ సుబ్బారావు కేసు నమోదుచేసి నిందితుల్ని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో బాలికను అపహరించినందుకు మూడేళ్ల జైలుశిక్ష, రూ. 12000 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. వస్తువుల్ని దొంగిలించిన నేరానికి రెండేళ్ళు, ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించినందుకు ఏడాది జైలుశిక్ష విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు చెప్పారు.

## వెంగమాంబ హుండీల లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

**దుత్తలూరు (ఉదయగిరి రూర ల్) :** నర్రవాడ వెంగమాంబ పేరంటాల అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీల ను లెక్కించా రు. 28.6.2024 నుంచి 7.8.2024 వరకు రూ.24,77,260ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కొండబిట్ర గుంట ప్రసన్న వెంకటే శ్వరస్వామి కార్యనిర్వాహ ణాధికారి ఏ.రాధాకృష్ణ పర్యవేక్షణలో వెంగ మాంబ పేరంటాలమ్మ ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో జగిరిన లెక్కింపులో విశ్రాంత స్టేట్‌బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో పార్కు, ఆటస్థలం రెండూ కరువే !

● పట్టణంలో ఇదీ దుస్థితి

**ఆత్మకూరు, ఆగస్టు 7:** స్థానిక మున్సిపాలిటీ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు ఆహ్లాదకరమైన పార్కులు, మినీ స్టేడియం అందుబాటులో లేకపోవడంతో దశాబ్ధకాలంగా యువత, వృద్ధులు, చిన్నారులు తీవ్ర నిరాశకు గురిఅవుతున్నారు. చిన్నారులకు సైతం ఆటవిడుపు స్థలం లేక ఆహ్లాదం కలిగించే సౌకర్యాలు కొరవడ్డాయి. గతంలో పోలీసుస్టేషన్ సమీపంలోని ఎస్ఎంకె పార్కు నిర్మాణానికి ఓ దాత ఎకరం స్థలం కేటాయించారు. అక్కడ పార్కు నిర్మాణం నోచుకున్న దాఖలాలు లేవు. కాలగమనంలో ఆ స్థలాన్ని తపాలా కార్యాలయానికి కేటాయిస్తున్నట్లు అప్పటి పంచాయతీ పాలకులు తీర్మాణం చేశారు. దీంతో పట్టణ ప్రజలు, చిన్నారులకు ఆటవిడుపు స్థలం కరువైంది. యువత ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు కరువయ్యాయి. రూ.1.32కోట్లతో పార్కు, రూ.2కోట్లతో మినీ స్టేడియం నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.



పార్కుకు కేటాయించిన స్థలం ఇదే..

● ఏడేళ్ల కిందటే పార్కు నిర్మాణం

ఏడేళ్ల క్రితం ప్రస్తుత మంత్రి, అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశంలో పస్తావించారు. సమావేశానికి హాజరైన మంత్రి నారాయణ పార్కుల ఏర్పాటుకు కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. మొదటి విడతగా బట్టేపాడు రోడ్డు సమీపంలోని వాటర్‌ప్లాంట్ వద్ద రెండెకరాల స్థలంలో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. స్థలంను చదును చేసి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అంతే. ఇక పనులు ముందుకు సాగలేదు. ఏడేళ్లకు పైబడి పార్కునకు కేటాయించిన స్థలం చిట్టడవిని తలపిస్తోంది.



నిలిచిపోయిన మినీ స్టేడియం

## రూ.2కోట్లతో మినీస్టేడియం నిర్మాణం

ఏడేళ్ల క్రితం మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్రావుపల్లి సమీపంలోని గురుకుల పాఠశాల వెనుక మినీ స్టేడియం నిర్మాణానికి ఐదెకరాల స్థలాన్ని కేటాయించారు. రూ.2కోట్ల నిధులు మంజూరైయ్యాయి. శ్రీధర్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. మొదట పనులు శరవేగంగా జరిగాయి. తదనంతరం స్టేడియం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఆనం రామనారాయణరెడ్డి మంత్రి పదవి చేపట్టడంతో పట్టణ ప్రజల్లో ఆశలు రేకెత్తించాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించి వీటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మంత్రి ఆనం ఆదేశాలతో తీరిన నీటి సమస్య



ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న బోరు

**ఆత్మకూరు, ఆగస్టు 7:** పట్టణ సమీపంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ప్రాంగణంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నీటి అవసరాల కోసం బోరును వేయించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రిన్సిపల్ కోటేశ్వరీ, అధ్యాపకులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి గురుకుల పాఠశాలను సందర్శించినపుడు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు.

## హామీని నెరవేర్చిన మేకపాటి

**మర్రిపాడు, ఆగస్టు 7:** ఎన్నికల ప్రచారంలో మర్రిపాడు ఎస్టీ కాలనీవాసులకు ఇచ్చిన హామీని బుధవారం మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నెరవేర్చాడు. రాములవారి విగ్రహాలు తయారు చేయించి కాలనీవాసులకు ఆయన సతీమణి టీడీపి ఆర్గనైజింగ్ సెక్రటరి శాంతి కుమారితో కలిసి అప్పగించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పాలన చేతకాక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని మండిపడ్డారు. ఆయన వెంట ఉన్న సైన్యమంతా ధన దాహంతో దోపిడీ ఎలా చేయాలన్న తపననే తప్ప ప్రజలకు సేవ చేయాలని ఎపుడే ప్రయత్నం చేయలేదన్నారు.

## జోరుగా బెల్టు షాపులు

**వింజమూరు, ఆగస్టు 7:** పట్టణంలో బెల్టుషాపులు మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలిశాయి. ముఖ్యంగా బంగ్లాసెంటర్, ఆర్టీసీ బస్టాండ్ దేవతా మహల్‌సెంటర్‌లో ప్రతి కూల్‌డ్రింక్ షాపులో బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 10గంటల వరకు మద్యం అధిక రేట్లకు అమ్ముతూ మద్యం ప్రియులకు ఎనీటైం మద్యం అందుబాటులోకి తెచ్చారు. ఇలా మద్యం ప్రియులకు ఎనీటైం మద్యం దొరుకుతు న్నందు వలన గొడవలు, అసాంఘిక కార్యక్రమాలు హెచ్చుమీరుతున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ రోడ్‌లో బెల్టుషాపులతో ప్రయాణికులకు ఇబ్బందికంగా మారింది. అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ ఆగడాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీ



సీతారామపురం: పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

**సీతారామపురం, ఆగస్టు 7:** మండలకేంద్రంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పరిశీలించారు. పనుల వద్దకు వెళ్లి కూలీలు చేయు పనులు, మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ కూలీలతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయాన్నే 6.30నుండి 11గంటల వరకు పనిచేయాలన్నారు.

### సంపద తయారీ కేంద్రాల పరిశీలన

కలెక్టర్ ఆదేశాల మేరకు సీతారామపురం, సింగరెడ్డిపల్లి, అయ్యవారిపల్లిలోని సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. కేంద్రాల చెత్త సెగ్రిగేషన్, సంపద కేంద్రల నిర్వహణను పరిశీలించారు. గ్రామంలో నుంచి సేకరించిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లతో గ్రేడింగ్ చేయించి వర్మీకంపోస్టును తయారు చేసి అమ్మేటట్లు చూడాలని కార్యదర్శులకు సూచించారు.

## గంగిరెడ్డిపల్లిలో వైద్యశిబిరం

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 7:** కొండాయపాలెం పంచాయతీలోని గంగిరెడ్డిపల్లిలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ సూచన మేరకు ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అంజయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన రోగులను పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, న్యాయవాదులు సందిరెడ్డి రామారావు, మస్తాన్, సీహెచ్‌వో శివకుమారి పాల్గొన్నారు.



## తహసీల్దార్లకు సన్మానం, అభినందనలు

**ఆత్మకూరు, ఆగస్టు 7:** మండల తహసీల్దారు సుధీర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు, డీలర్స్ అసోషియేషన్ నాయకులు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పల్లవోలు జయాకర్, తెలుగు యువజన జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, షేక్ షబ్బీర్, మున్సిపల్ కౌన్సిలర్ శివకోటారెడ్డి, ఏపీయుడబ్ల్యుజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య, డీలర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.



ఆత్మకూరు: తహసీల్దారును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

**ఏఎస్ పేట:** మండల తహసీల్దారు శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు చెంచులరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నీలం వీరబ్రహ్మం, మాల్యాద్రి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పేట: తహసీల్దారుకు ప్రధాని ఫొటోను బహూకరిస్తున్న చెంచులరెడ్డి

**సంగం:** తహసీల్దారు సోమ్లానాయక్‌ను కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువా, పూలమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సుభాషిణి, ఆర్ఐ, సర్వేయర్ పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** మండల తహసీల్దారు ఎం.సుభద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

**అనంతసాగరం:** తహసీల్దారు వీరవసంతరావును స్థానిక టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. సమస్యలు పరిష్కరించేలా ప్రతేక చొరవ చూపాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో చల్లాశివారెడ్డి, శాకమూరి సుబ్బారావు, కేతా శ్రీనివాసులురెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**అనంతసాగరం, ఆగస్టు 7:** చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ఆజాదీక అమృత్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు, జాతీయ జెండాతో గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, రమణ, మాధవి, మదీనా, శివకృష్ణ పాల్గొన్నారు.



అనంతసాగరం- చిలకలమర్రిలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

**ఉదయగిరి రూరల్:** పట్టణంలో అధికారులు, సచివాలయ సిబ్బంది విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక దళితవాడ పాఠశాల నుంచి ఇండియన్ పెట్రోల్‌బంకు వరకు నినాదాలతో ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, ఎంఈవో తోట శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా పాల్గొన్నారు.



ఉదయగిరి ర్యాలీలో పాల్గొన్న అధికారులు

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



ఆత్మకూరు: వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీవో సునీలత

**ఆత్మకూరు, ఆగస్టు 7:** ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వెన్నవాడ ఎస్సీకాలనీ లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా సీడీపీవో సునీలత పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్ ఎన్‌కె.నారాయణమ్మ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**వింజమూరు:** స్థానిక మాశిలామణి హాస్పిటల్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** పట్టణంలోని సచివాలయం-3లో గండిపాళెం ప్రాథమిక



వింజమూరులో..

ఆరోగ్య కేంద్ర ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. తల్లులు, గర్భవతులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

## క్రికెట్ కిట్ అందజేత

**సంగం, ఆగస్టు 7:** స్థానిక ఉన్న ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలకు రూ.7,500ల విలువ చేసే క్రికెట్ కిట్ ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పీడీ అంజయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలం పరిశీలన



సంగం: స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

**సంగం, ఆగస్టు 7:** స్థానిక తిరుమనతిప్పలో వాటర్ ట్యాంక్ నిర్మాణ అవసరమైన స్థలాన్ని బుధవారం ఆర్డీఓ మధులత పరిశీలించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి కేంద్ర నిధులతో అమృత -2 పథకంలో సంగం బ్యారేజీ నుంచి పైపులతో బుచ్చిరెడ్డిపాళెంకు తాగునీటిని తరలించనున్నారు. అందులో భాగంగా తిరుమనతిప్పలో వాటర్ ట్యాంకు నిర్మించి బ్యారేజీ నుంచి నీటిని తరలించనున్నట్లు తెలిపారు. తహసీల్దారు సోమ్లానాయిక్, సర్వేయర్ శాంత ఉన్నారు.

## 45.4 మి.మీ వర్షపాతం

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 7:** ఉదయగిరిలో బుధవారం తెల్లవారుజామున 45.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. ఈ వర్షంతో డ్రైనేజీ కాలువలు పొంగడంతో రహదారులపై చెత్తాచెదారం పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు, ఉద్యానవన పంటలకు ఈ వర్షం ఊరటనిచ్చింది.





ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన గుడ్లూరు సర్పంచి పాలకీర్తి శంకర్, గ్రామస్థులు

## గుడ్లూరు సర్పంచి టీడీపీలో చేరిక

**కందుకూరు, ఆగస్టు 7:** మండల కేంద్రమైన గుడ్లూరు సర్పంచ్ పాలకీర్తి శంకర్ తెలుగుదేశం పార్టీలో చేరారు. సర్పంచ్ శంకర్‌తో పాటు 3వ వార్డు మెంబరు పాలకీర్తి మురళి, పలువురు వైసీసీ కార్యకర్తలు కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరడంతో వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయటం జరుగుతుందని, అదే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గుడ్లూరు గ్రామాభివృద్ధికోసం సర్పంచ్ శంకర్‌కు సంపూర్ణ సహాయ సహకారాలు అందించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు దామా వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ రమణమ్మ, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవయ్య, జంపని ప్రసాద్, కోకా చిరంజీవి, చిత్తారి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించని పాఠశాలపై

## చర్యలు తీసుకోవాలి

**చిట్రగుంట, (దగదర్తి) ఆగస్టు 7:** నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రాఘవేంద్ర ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలపై చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఈవో రఘురామయ్యకు మండల విద్యా కార్యాలయంలలో బుధవారం స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఎంఈఓ భాస్కర్‌తో కలిసి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల భవన అంతస్థులపై విద్యార్థుల రక్షణకు ఏర్పాటు చేయాల్సిన ఇనుప గ్రిల్ లేదని నిర్వాహకులపై మండిపడ్డారు. పాఠశాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**చిట్రగుంట (దగదర్తి) ఆగస్టు 7:** దగదర్తి మండలం కేకేగుంట పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఏపీడీ మృదుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె జూలై 29వ తేది నుంచి ఆగస్టు 7వరకు కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. 30 మంది కూలీలు మాత్రమే హాజరు కావడంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. జాబ్‌కార్డులో ఉన్నవారు కాకుండా ఇతరులు ఉంటే చర్యలు తప్పవని మేటీలను హెచ్చరించారు. ఆమె వెంట ఏపీవో జ్ఞానప్రకాశ్ తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్ల విధుల నిర్వహణపై దిశానిర్దేశం

**కావలి, ఆగస్టు7:** బదిలీల అనంతరం డివిజన్‌లోని అన్ని మండలాలకు నూతన తహసీల్దార్లు రావటంతో వారి విధుల నిర్వహణపై కావలి ఆర్డీవో శీనానాయక్ దిశ నిర్దేశాలను చేశారు. ఆర్డీవో కార్యాలయ చాంబరులో బుధవారం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

వారితో డిజన్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు ప్రస్తుతం మండలంలో ప్రత్యేకంగా చేయాల్సిన విధులు గురించి వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మ్యుటేషన్స్ సౌమోటో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు, రీ సర్వే గ్రామాల్లో ఎల్‌పీ నంబర్లతో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో తహసీల్దార్లకు వివరించారు.

## మండల్ కమిషన్ నివేదిక సిఫార్సులు అమలు చేయాలి

**కందుకూరు, ఆగస్టు 7:** మండల్ కమిషన్ నివేదికలోని అంశాలన్నింటినీ అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కల్లగుంట మోహనరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మండల్ కమిషన్ నివేదిక సమర్పించి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా స్థానిక బీటీఏ కార్యాలయంలో బుధవారం మండల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన ఆధారంగా మాత్రమే బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు షేక్ అబ్దుల్లా,పర్రె వెంకటరావు, టి గంగయ్య, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కొప్పుల ఆదాము పాల్గొన్నారు.

## కందుకూరు తహసీల్దార్‌గా సయ్యద్ ఇక్బాల్

**కందుకూరు, ఆగస్టు 7:** స్థానిక తహసీల్దార్‌గా సయ్యద్ ఇక్బాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ ఇక్బాల్

## గుడ్లూరు తహసీల్దార్‌గా స్వర్ణ

**గుడ్లూరు, ఆగస్టు 7:** నూతన తహసీల్దార్‌గా జి స్వర్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలో రెవిన్యూ రెవిన్యూ సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది శ్రీనివాసులు, హరిబాబు, అంజలయ్య తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న స్వర్ణ

## సాయిపేటలో విగ్రహాల ప్రతిష్ఠ

**కొండాపురం, ఆగస్టు7:** సాయిపేట గ్రామంలో పలువురు భక్తుల సహకారంతో రజకులు ఏర్పాటు చేసుకున్న అంకమ్మ అమ్మవారు, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే వేడుకలో మొదటిరోజ శ్రీమహాగణపతి పూజ, వరుణపూజ, తీర్థానయమ్, అఖండల ప్రజలన, ప్రధానకలశ, కర్కరి, వర్ధని, వరుణ కలశ స్థాపనలు తదితర పూజలు చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య యాగశాలకు విగ్రహాన్ని చేర్చారు. అనంతరం శ్రీవిశ్వకర్మాది పంచబ్రహ్మ మండల, వాస్తుమండల, యోగిని మండల, క్షేత్రపాలక మండల, నవగ్రహ మండల దేవతా ఆవాహన, గ్రామదేవత ఆవాహన తదితర పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను పండితులు భక్తులకు అందజేశారు.

## రమణయ్య నాయుడికి పరామర్శ

**చిట్రగుంట, (దగదర్తి) ఆగస్టు 7:** దగదర్తి మండలానికి చెందిన మాజీ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాళ్లూరి రమణయ్య నాయుడును బుధవారం కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది వచ్చిన ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో దగదర్తి ఎంపీపీ తాళ్లూరి వెంకట ప్రసాద్ నాయుడు, సర్పంచు చల్లంచర్ల శీనయ్య, చెన్నూరు మాజీ సర్పంచు విజయ్, వెంకటకృష్ణ, రవి, శీనయ్య తదితరులు ఉన్నారు.



తాళ్లూరి రమణయ్య నాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లింగసముద్రం విద్యార్థులు

**లింగసముద్రం, ఆగస్టు 7 :** రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం వీరిని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ మంగతాయారు, ఉపాధ్యాయులు అభినందించారు. హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవరావు మాట్లాడుతూ ఈనెల 6న ఒంగోలులోని ఏబిఎం కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెలక్షన్స్‌లో తమ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సీహెచ్ వెంకటేష్, పి ప్రతిమ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు ఎం కొండయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్‌వలి, అనంతలక్ష్మి, విద్యార్థులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవరావు

## సర్పంచి, కార్యదర్శులకు శిక్షణ

**జలదంకి:** సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజులు శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర బుధవారం తెలిపారు. గురు, శుక్ర, శనివారాల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశహాలులో వీరికి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు మండలంలోని 17పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

## కక్ష సాధింపు చర్యలు సహించం

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

**కావలిటౌన్, ఆగస్టు7:** కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించమని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జర్నలిస్ట్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వైసీపీ నేతలతో కలిసి మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయలేకపోతున్నారని ఆరోపించారు. కావలి అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ట్రంకు రోడ్డు వెడల్పు పనులు డివైడర్ సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనుల ప్రణాళికతో ప్రారంభిస్తే మిగిలిన పనులు పూర్తిచేయలేకపోయామన్నారు. నూతన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనం పూర్తిగా మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందాలని అందుకు తాను పూర్తిగా తనవంతు సహకారమందిస్తానన్నారు. అక్రమ లేఅవుట్లలోని 120ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయ్యిందని ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణల్లో పసలేదన్నారు. అన్యాక్రాంతమైన భూములెక్కడనున్నాయే ఎవరు ఆక్రమించారో ఆర్డీవో పర్యవేక్షణలో నిగ్గుతేల్చి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, బీద రమేష్, సాయికుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణపై శిక్షణ

**కావలి రూరల్, ఆగస్టు7:** స్థానిక మండల కార్యాలయంలో పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణపై గురువారం నుంచి శిక్షణ ఇస్తున్నట్లు ఎమ్పీడీవో శ్రీధర్‌బాబు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరై గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి అల్పాహారం, భోజన వసతి కల్పిస్తామన్నారు.

## ఆయుర్వేద వైద్యశాల ప్రారంభం

**కావలి, ఆగస్టు7:** పట్టణంలో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. రెండోవార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్యశాలను ప్రారంభించారు. అనంతరం వైద్యశాలలో అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముసునూరు ఆటోనగర్‌లోని విలేజి మిల్క్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు అమ్మి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. పాతూరులోని టీడీపీ బీసీసెల్ నాయకుడు బొంతా శ్రీనివాసులు మనవరాలి బారసాల కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. స్థానిక 36వ వార్డు చేవూరి వారితోటలో యేటూరి రామిరెడ్డి సతీమణి వెంకట సుబ్బమ్మ మృతి చెందటంతో ఆమె పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

**వలేటివారిపాలెం, ఆగస్టు 7 :** ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత బొంతవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

**కొండాపురం:** అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు, గర్భవతులకు సూచించారు. గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ పి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.మమత, ఎమ్.శ్రీదేవి, టీ.సుల్తానమ్మ, బి.సుబ్బరత్నం, ఎమ్. మౌనిక, కె.వరమ్మ, విజయలక్ష్మి, ఎమ్.ఎస్.కె , జె.అనూరాధ, ఆశా కార్యకర్త స్వాతి పాల్గొన్నారు. కొమ్ముపాలెంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్. గోపీచందన, హెల్పర్ కె.కొండమ్మ పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ

**అల్లూరు, ఆగస్టు 7:** మండల కేంద్రంలో సాయంత్రం అధికారులు హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో విద్యాధికారి రవీంద్రనాథ్ ఇస్కపల్లి జడ్పీ హైస్కూలు, అల్లూరు రామకృష్ణా డిగ్రీ కళాశాల, పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. బాలలు చేసిన ప్రత్యేక నాటికలు, నృత్యాలు, పాటలు అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశంపై ప్రతిఒక్కరికీ భక్తిని పెంపొందించడమే దీన్ని ఉద్దేశ్యం అన్నారు.

## గ్రామీణాభివృద్ధిపై శిక్షణ తరగతులు

**అల్లూరు, ఆగస్టు 7:** గ్రామీణాభివృద్ధికి అనుసరించే పలు అంశాలపై ఈనెల 8 నుండి 10 వరకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమానికి కార్యదర్శులు, సర్పంచ్‌లు విధిగా హాజరవ్వాలని పేర్కొన్నారు.

## నేడు విద్యా కమిటీ చైర్మన్ల ఎంపిక

**చిట్రగుంట, ఆగస్టు 7:** బోగోలు మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరుగనున్న విద్యాకమిటీ చైర్మన్ల ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లో ప్రధానోపాధ్యాలు, ఉన్నత పాఠశాల్లో పరిశీలకుల ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహిస్తామని బుధవారం వారు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లితండ్రులు తరగతి కమిటీ సభ్యులను ఎంపిక చేసిన అనంతరం వారితో ఎంపికైన కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మను ఎన్నుకుంటారని తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

# పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

● పట్టించుకోని అధికారులు
● నష్టపోతున్న కొనుగోలుదారులు



అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్

**తోటపల్లిగూడూరు, ఆగస్టు 7:** మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నష్టపోతున్నట్లు కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు కట్టుకోవాలనే సామాన్యుల ఆశలను ఆసరాగా చేసుకుంటున్న రియల్టర్లు నిండా ముంచేస్తున్నారు. ఎలాంటి పంచాయతీ అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. తోటపల్లి గూడూరు మండలం నరుకూరు పంచాయతీల్లో 23 అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. ఎలాంటి పంచాయతీ అనుమతులు లేకుండా గత ప్రభుత్వంలో వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అంకణం రూ.60వేలు నుంచి లక్ష రూపాయల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటవుతున్న లేఅవుట్లు కారణంగా ప్లాట్ల కొనుగోలుదారులు నిలువునా మునిగిపోతున్నారు. అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పంచాయతీ కార్యదర్శి వివరణ

నరుకూరులో 23 అక్రమ లే అవుట్లు ఉన్నాయి. కేవలం కన్వర్షన్ చేసుకున్నారే తప్ప గ్రామ పంచాయతీ అనుమతులు పొందలేదని, ఈ లేఅవుట్ల స్థలాలు యజమానులకు ఏవిధమైన సర్టిఫికెట్లు ఇవ్వలేదని కార్యదర్శి సుల్తాన్ అజీజ్ పేర్కొన్నారు.

## హోం మంత్రిని కలిసిన సీఐ, ఎస్ఐ



రాష్ట్ర హోంశాఖమంత్రి అనితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ శ్రీనివాసులు తదితరులు

**కోవూరు, ఆగస్టు 7:** రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనితకు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి నుంచి రోడ్డుమార్గంలో చెన్నై వెళ్తున్న ఆమె కొద్ది సమయం జాతీయ రహదారి పక్కనున్న నెల్లూరు గ్రాండ్ హోటల్‌లో సేదతీరారు. ఈ క్రమంలో పలువురు పోలీసు అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## పంట నమోదు పరిశీలన



పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

**కోవూరు, ఆగస్టు7:** మండల పరిధిలోని ఇనమడుగు, పాటూరు గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారిణి పి సత్యవతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ సాంకేతిక లోపాల సవరణకు పలు సూచనలు చేశారు. చేపల సాగుచేస్తుంటే వివరాల్ని వ్యవసాయ సహాయకులు నమోదు చేయాలన్నారు. కౌలు రైతుల వివరాల్ని సేకరించాల్సిందిగా కోరారు. ఆమె వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీ, శేషగిరి, సుజాత, వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు మొహరున్నీసా, చైతన్య, శ్వేతలేఖ, మౌనిక, వంశీ తదితరులున్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం

**పొదలకూరు, ఆగస్టు 7 :** స్థానిక పద్మావతినగర్‌లో నివాసం ఉంటున్న బంగా రంగయ్య, వెంకటరమణమ్మ దంపతుల కుమార్తె వివాహానికి ఏపీఆర్డీ ఆర్గనైజేషన్ రూ.50వేల ఆర్థిక సాయం బుధవారం అందించింది. ఈ సందర్భంగా వెంకటరమణమ్మ మాట్లాడుతూ తమ పెద్ద కూతురు పెళ్లి ఖర్చులకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక సంస్థ ప్రతినిధి వెంకటేశ్వర్లుకు చెప్పుకున్నామని, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర శాఖతో మాట్లాడి ఈ మొత్తాన్ని ఇప్పించడం సంతోషంగా ఉందన్నారు.

## నేటి నుంచి శిక్షణ తరగతులు

**తోటపల్లిగూడూరు, ఆగస్టు 7:** ఎంపీడీవో కార్యాలయంలో ఆగస్టు 8, 9, 10 తేదీల్లో గ్రామ పంచాయతీ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ, ఇన్‌చార్జ్ ఈవోఆర్డీ గీతాలలితా కుమారి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు.

## మినగల్లులో 104 వైద్య సేవలు



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

**బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 7:** మండలంలోని మినగల్లు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో గ్రామంలోని రోగులకు వైద్యాధికారి డాక్టర్ వినయ్ 104 ద్వారా వైద్యసేవలందించారు. పలువురు రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, హెచ్ఏ. మోహన్, ఏఎన్ఎం ప్రియ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహసీల్దారుకు సన్మానం



తోటపల్లిగూడూరు: తహసీల్దారు పద్మజను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**తోటపల్లిగూడూరు, ఆగస్టు 7:** మండలంలోని పాపిరెడ్డి పాలెం గ్రామ టీడీపీ నాయకులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు పద్మజను బుధవారం కలిసి సన్మానించారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఉపసర్పంచ్ మేనాటి సీనయ్య పరుచూరి హరిబాబు, దద్దోలు మనోహర్, నిరంజన్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

● **మనుబోలు:** మండలానికి కొత్త తహసీల్దార్‌గా వచ్చిన సిహెచ్ సుబ్బయ్యను బుధవారం చెర్లోపల్లి, మడమనూరు, మనుబోలు గ్రామాల టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనుబోలు టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య, నాయకులు దండు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, సతీష్, దామోదర్‌రెడ్డి, ఉడతా విజయ్‌కుమార్, సుధీర్, తదితరులు ఉన్నారు.

● **విడవలూరు:** మండల తహసీల్దారుగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది భానుప్రకాష్, ఆర్ఐ, వీఆర్‌వోలు ఆయన్ను సత్కరించారు.

## గోసు రాఘవరెడ్డి సేవలు చిరస్మరణీయం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి నివాళి



గోసు రాఘవరెడ్డికి నివాళి అర్పిస్తున్న సోమిరెడ్డి

**పొదలకూరు, ఆగస్టు 7:** టీడీపీ సీనియర్ నాయకుడు, పొదలకూరు మాజీ సర్పంచ్, రాపూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ దివంగత గోసు రాఘవరెడ్డి సేవలు చిరస్మరణీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం గోసు రాఘవరెడ్డి వర్ధంతి సందర్భంగా లింగంపల్లిలోని ఆయన స్వగృహానికి సోమిరెడ్డి వెళ్లి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పొదలకూరులో లెమన్ మార్కెట్ యార్డు నిర్మించి రైతులకు, వ్యాపారులకు మేలు చేశారన్నారు. సర్పంచ్‌గా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహం ఏర్పాటు చేయడానికి కేటాయించిన స్థలంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అడ్డుపడి రెండు చోట్ల వారి తండ్రి విగ్రహం ఏర్పాటు చేసుకోవడాన్ని విమర్శించారు. అంతకుముందు ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి గ్రామీణ ఈస్టోర్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, బోగోలు బాలకృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు గోసు శ్యామల, ఆదాల సుగుణమ్మ పాల్గొన్నారు.

## భూకబ్జారాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

● పోలీసు, రెవెన్యూ అధికారులకు టీడీపీ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రంఇస్తున్న టీడీపీ నేతలు

**మనుబోలు, ఆగస్టు 7:** మండలంలో ప్రభుత్వ భూములు కాజేసిన భూకబ్జారాయుళ్లపై సివిల్, క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు బుధవారం రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య మాట్లాడుతూ కొమ్మలపూడిలో వైసీపీ నాయకుడు చెందులూరు శ్రీనువాసులు సర్వేనెం 23-2లో ఉన్న ప్రభుత్వ భూములు కాజేసి రెవెన్యూ రికార్డుల్లో దొంగతనంగా పేర్లు నమోదు చేసుకున్నాడన్నారు. అలాగే అక్కంపేటలో కాంగ్రెస్ నాయకుడు కిరణ్ కుమార్‌రెడ్డి వైసీపీలో ఉన్న సమయంలో 3-74 సెంట్ల ప్రభుత్వభూమిని తారుమారుచేసి తనపై చేయించుకుని తిరిగి ఆ భూమిని ప్రభుత్వంకే అమ్మి రూ.కోటి సొమ్ము చేసుకున్నాడన్నారు. ఇలాంటి వ్యక్తులు ఎమ్మెల్యే సోమిరెడ్డిని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. భూకబ్జారాయుళ్ళ బాగోతం త్వరలోనే బయటపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్‌నాయుడు, మన్నెమాల ఆదినారాయణరెడ్డి, పెంచలయ్య, ఉడతా విజయ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, పాల్గొన్నారు.

## ఆజాదీకా అమృత్ మహోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

**మనుబోలు, ఆగస్టు 7:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్య క్రమంలో భాగంగా బుధ వారం స్థానిక వైఎస్ఆర్ విగ్ర హం నుంచి మనుబోలు గ్రా మం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారం ఏర్పాటుచేసి స్వాతంత్ర్య సమరయోధుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, మండల పంచాయతీ విస్తరణాధికారి జీవిఎస్‌వి ప్రసాద్, కార్యదర్శులు చెంచుప్రసాద్, రేష్మాసోని తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి గంగమ్మ కొలువు మహోత్సవం

**పొదలకూరు, ఆగస్టు 7 :** పట్టణంలోని శివాలయం వీధిలో గంగమ్మ తల్లి కొలువు మహోత్సవం 9వ తేదీ నుంచి 11 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, యాదవులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు కుంకుమపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, సహస్రనామార్చన, మధ్యాహ్నం 2గంటలకు ఆచారం తెలియజేయుట, సాయంత్రం 3గంటలకు అమ్మవారి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మూడు రోజులు అత్యంత వైభవంగా జరుగు గంగమ్మతల్లి కొలువు మహోత్సవంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## గిరిజనుల స్థలం కబ్జాచేసిన వ్యక్తికి నోటీసులు

**బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు7:** మండంలోని మినగల్లు పంచాయతీ పాత మినగల్లు గ్రామంలో గిరిజనుల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన నన్నేమస్తాన్ అనే వ్యక్తి కబ్జా చేసి ఇంటి నిర్మాణానికి పునాదులు తీశాడు. దీంతో గిరిజనులు స్థానిక నాయకులను ఆశ్రయించారు. అయితే అదే ప్రాంతంలోని ఓ స్థలంలో మస్తాన్ తన సెంట్రింగ్ సామాన్లు వేసుకునేందుకు సిద్ధం చేయడంతోపాటు మరికొంత స్థలాన్ని ఇంటి నిర్మాణం కోసం పునాదులు వేయడంపై స్థానికులు అడ్డుకున్నారు. దీంతో వివాదాస్పదమైంది. కబ్జాదారుడికి పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినా నిరాకరించడంతో కబ్జాస్థలం వద్ద వాటర్‌ట్యాంకుకు తగిలించి వెళ్లారు. దీనిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## గిరిజనులు, దళితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**విడవలూరు, ఆగస్టు 7:** నిరుపేదలైన దళితులు, గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని దళిత సంఘం రాష్ట్ర నాయకురాలు పల్లం శేషమ్మ కోరారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దళిత, గిరిజనుల ఓట్లతో గెలిచిన వైసీపీ అధికారంలోకి రాగానే వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## స్టేడియంలో మొక్కల పెంపకం

**నెల్లూరు (విద్య), ఆగస్టు 7:** నగరంలోని ఏసీ సుబ్బా రెడ్డి స్టేడియంలో బుధవారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియే షన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ రామ్మోహన్‌రెడ్డి, మహ్మద్ రఫీ సౌజన్యంతో స్టేడియం లో మహాగని మొక్కలు నాటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు బీ కృష్ణయ్య, బీ మారుతీరావు, రమణయ్య, సుబ్బారావు, పిచ్చయ్య, వెంకటే శ్వర్లు, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

## తనను కొట్టి తనపైనే కేసా..!?

**బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 7 :** తనను కొట్టి తనపైనే కేసుపెట్టి పోలీసులతో కొట్టించారని పంచేడు మాజీ సర్పంచు మామిళ్ళ నాగయ్య వాపోయాడు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత టీడీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి వల్లే తమకు అన్యాయం జరుగుతోందన్నారు. బ్యాంకు ఖాతాల్లోని పలువురి పింఛన్ల నగదును కూడా ఆ గ్రామ వీవోఏ ద్వారా పొదుపు రుణాలకు బదలాయింపజేశారని ఆయన ఆరోపించారు. కాగా నాగయ్య పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, దీంతో ఆయన్ను నెల్లూరులోని పెద్దాసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. మరోవైపు సూరా, సుబ్బారెడ్డిపై కక్ష సాధింపు కోసం వైసీపీ నాయకులు పిడుగు మధు, తుమ్మల ప్రసాద్‌రెడ్డి తమను ఎరగా వాడుకుంటున్నారని బాధిత మహిళ చైత్ర వాపోయింది. గిరిజన పెద్ద మాట్లాడుతూ ఈ వ్యవహారంపై కలెక్టర్, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. సీఐ షైమారావు వివరణ ఇస్తూ వ్యక్తిగత విషయాలపై ఇరు వర్గాలు ఆరోపణలు చేసుకుంటున్నారని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి



## రేపు కలెక్టరేట్‌లో మంత్రి నారాయణ అర్జీల స్వీకరణ

**నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 7 :** కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి నగరంలోని సమస్యలపై ఆయన అర్జీలు స్వీకరిస్తారు.

## నేత్రపర్వం తిరునక్షత్రోత్సవం



రంగనాథస్వామి ఆలయంలో విశేష అలంకారంలో ఉత్సవమూర్తులు

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 7 :** తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి జన్మనక్షత్రం (ఆడినెల పుబ్బ) సందర్భంగా బుధవారం వేడుకలు కనుల పండువ గా జరిగాయి. ఉదయం రంగనాథస్వామి, ఆండాళ్ అమ్మవారికి పేట ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి, ఆండాళ్ అమ్మవార్లకు ప్రాకారో త్సవం, ఎదురుకోలు ఉత్సవాలు జరిగాయి. ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసు లు, ధర్మకర్తలు, ఈవో అర్చభూమి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



గాంధీనగర్‌లో గోదాదేవికి పూజలు

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు జరిగాయి. అర్చకుడు బీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం గోదాదేవికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, స్నపన తిరుమంజనం జరిగాయి. సాయంత్రం సామూహిక తిరుప్పావై పారాయణం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● మాగుంట లే అవుట్‌లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి విశేషంగా తిరుమంజన సేవ జరిగింది. భక్తులు దివ్యప్రబంధ పారాయణం చేశారు.

## 'నేతన్న నేస్తం' కొనసాగించాలి

● చేనేత దినోత్సవంలో నాయకులు



సమావేశంలో సన్మానం అందుకున్న చేనేత కళాకారులు

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 7 :** నేతన్న నేస్తం పథకాన్ని కొనసాగించి చేనేత కుటుంబాలను ఆదుకోవాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని రామ్మూర్తినగర్‌లో గల ఆ సంఘం కార్యాలయంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ చేనేత పరిశ్రమను, కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రతి మండలంలో చేనేత బజార్లు ఏర్పాటు చేయాలని కోరారు. తొలుత గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత కార్మికుల పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. 50 మంది చేనేత వృద్ధ కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పముజుల నాగేశ్వర రావు, శ్రీనివాసులు, ఎర్ర ధనుంజయులు హాజరయ్యారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మన్నెం సతీష్, కార్యదర్శి పముజుల శంకరయ్య, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ సజ్జ వెంకట సురేష్, కోశాధికారి కొండ మాధవయ్య, చేనేత విభాగం అధ్యక్షుడు అశం సురేష్, పముజుల హరి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కబర్ది సేవలు శ్లాఘనీయం : వేనాటి



కబర్దికి జ్ఞాపిక అందజేస్తున్న న్యాయవాదులు

**నెల్లూరు (లీగల్), ఆగస్టు 7 :** న్యాయాధికారిగా కబర్ది అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు. నెల్లూరు 1వ అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తూ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా పదోన్నతిపై బదిలీ అయిన జీ కబర్ది గౌరవార్థం నెల్లూరు బార్ అసోసియేషన్ హాలులో బుధవారం మధ్యాహ్నం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేనాటి మాట్లాడుతూ కబర్ది మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు జడ్జిలు, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఎం సుందరయ్య యదవ్, న్యాయవాదులు పాల్గొన్నారు. కబర్దిని ఘనంగా సత్కరించారు.

## ఇంజనీరింగ్ విద్యతో ఉజ్వల భవిష్యత్

● 'సీ చేంజ్' సీఈవో ప్రకాష్ శేషాద్రి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రతినిధులు

**నెల్లూరు (విద్య), ఆగస్టు 7:** నేటి పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యలో ఉత్తమంగా రాణిస్తే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని సీ చేంజ్ కన్సల్టెంట్ సీఈవో ప్రకాష్ శేషాద్రి తెలిపా రు. నగరంలోని నారాయణ ఇంజనీరిం గ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. నూతన సాం కేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు వి ద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. భా రతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికతను మరిచిపోకుండా ఎక్కడికి వెళ్లినా మన ప్రాంతం, దేశం గర్వించేలా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అనంతరం ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య, అందులోని అవకాశాలు, ఎలా ఉన్నతంగా ఎదగాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, ఏజీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చేందుకు కృషి

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



ఎమ్మెల్యే కోటంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నజీర్‌బాషా

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 7 :** భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గీతా వైభవ్ ట్రస్ట్‌కు హామీ ఇచ్చారు. బుధవారం ఆ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నజీర్‌బాషా, సభ్యులు నగరంలో ఎమ్మెల్యేను కలిసి ఈనెల 18న జరిగే మహానగర సంకీర్తన కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవద్గీతను నేర్పించడంతోపాటు ప్రచారం చేస్తున్న నజీర్‌బాషా సేవలను అభినందించారు. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జాలాది నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, బండారు రాజేశ్వరమ్మ, సుమలత పాల్గొన్నారు.

## సరికొత్త టెక్నాలజీతో బజాజ్ పల్సర్ బైక్

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 7 :** సరికొత్త టెక్నాలజీతో తయారైన పల్సర్ ఎన్ఎస్ 400 బైక్ విడుదల కార్యక్రమం బుధవారం నగరంలోని ఎంజీబీ ఫెసిలిటీ మాల్‌లో ఘనంగా జరిగింది. ఎంజీబీ గ్రూపు ఎండీ ఎంజీ గోపాలకృష్ణ, బజాజ్ సర్వీసు ఆర్ఎం సచిన్‌జైన్ ముఖ్య అతిథులుగా పాల్గొని వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. పల్సర్ బైక్ ఎన్ఎస్ 400లో 373 సీసీ ఇంజన్, 40 బీహెచ్‌సీ శక్తి ఉత్పత్తితో స్పీడ్ పవర్ ట్రెయిన్ ద్వారా వెనుక చక్రానికి 35 ఎంఎం టార్క్ సపోర్టు చేస్తుందన్నారు. ఎల్ఈడీ లైటింగ్, టర్న్‌బైటర్న్ నావిగేషన్, బ్లూటూత్ కనెక్టివిటీ సదుపాయాలు ఉన్నాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పల్సర్‌బైక్ విడుదల చేస్తున్న ఎండీ గోపాలకృష్ణ

## 'జనసేన సభ్యత్వం 36వేలు'

**నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట),ఆగస్టు7:** జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోందని ఆ పార్టీ కోర్‌కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సభ్యత్వ నమోదు 36 వేలకు చేరిందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం ఉందని, రాష్ట్రాన్ని సంక్షేమాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే జనసేన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, నాగిశెట్టి, బోగినేని కాశీరావు, బోనుబోయన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో 2వేలకుపైగా సభ్యత్వాలు చేసి మల్లికార్జున యాదవ్ ప్రథమ స్థానంలో నిలవగా, వెయ్యికిపైగా సభ్యత్వాలతో గునుకుల కిషోర్ రెండో స్థానంలో నిలిచాడు.

## నేటి నుంచి మహాలక్ష్మి ఆలయంలో వార్షికోత్సవాలు

**నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 7 :** నగరంలోని కోదండరామపురంలో గల మహాలక్ష్మి ఆలయంలో 19వ వార్షికోత్సవాలు గురువారం నుంచి 10వతేదీ వరకు జరుగుతాయని ఆలయ ఛైర్మన్ పత్తి నరసింహం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగమ పండితుడు మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం గోపూజ, గణపతి పూజ, కలిశ స్థాపన, సాయంత్రం 4 గంటల నుంచి బోనాల ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు సామూహిక కంకుమార్చన, కలిశపూజ, రాత్రికి శ్రీవారి కల్యాణం, హోమాలు జరుగుతాయన్నారు. 10వతేదీ శనివారం ఉదయం అభిషేకం, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, వసంతోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

## 'పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి'

**నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 7 :** రాష్ట్రంలోని పాస్టర్లకు ప్రభుత్వం గౌరవవేతనం ఇవ్వాలని పాస్టర్ వెల్ఫేర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐఎస్ బెనహర్‌బాబు. ప్రచార కార్యదర్శి ఎద్దు శివరావు కోరారు. బుధవారం నగరంలోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాలులో నెల్లూరుజిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి కిషోర్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జాషువా తదితరులు పాల్గొన్నారు.

## మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

● డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి

**నెల్లూరు(వైద్యం), ఆగస్టు 7 :** మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి ఆదేశించారు. బుధవారం కిసాన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు ఆర్‌సీహెచ్ శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా డీఐవో మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు బజారు పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ మిస్బా సుల్తానా, కిసాన్‌నగర్ వైద్యాధికారి డాక్టర్ సునీల్‌బాబు, సీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు పిల్లలకు ఫీజులో రాయితీ

● కళాశాలల యాజమాన్యంతో సమావేశమైన ఎస్పీ

**నెల్లూరు,(క్రైం), అగస్టు 7:** పోలీసుల పిల్లల్లో ఇంటర్ చదువుతున్న వారికి అన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో 30 శాతం ఫీజు రాయితీ లభించనుంది. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యంతో ఎస్పీ జీ కృష్ణకాంత్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలీసుల పిల్లలకు ఉచిత, రాయితీతో సీట్లు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకారం తెలిపాయని పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు తెలిపారు.

## చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి

**నెల్లూరు (క్రైం), ఆగస్టు 7:** వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేటకు చెందిన వీ వెంకటేష్(31) ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఈ నెల 4వ తేదీ బైక్‌పై ములుముడి బస్టాం డు వైపు వెళుతుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి పలు వైద్యశాలల్లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వెంకటేష్ సోదరుడు సాయికుమార్ నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ గీతారమ్మ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.


## చికిత్స పొందుతూ కానిస్టేబుల్..

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇందుకూ రుపేట పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ వై కృష్ణ బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి ఏపీ పోలీ సు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర నాయకుడు వై శ్రీహరి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



# తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 8 ఆగస్టు 2024




## సీవీఎస్వో శ్రీధర్ బాధ్యతల స్వీకారం



టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకమండపంలో బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించాక గర్భాలయంలోని మూల మూర్తిని దర్శించుకున్నారు.సీవీఎస్వో శ్రీధర్‌ను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు శ్రీవారి ఫొటోతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం సీవీఎస్వో ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..టీటీడీలోని అన్ని విషయాలనూ అవగాహన చేసుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా పనిచేస్తానని, ఆ శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

**- తిరుమల, ఆంధ్రజ్యోతి**



మాడవీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి



పొగడచెట్టుకు హారతి

## పురుశైవారితోటలో మలయప్ప

భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) ఆవిర్భవించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది కూడా టీటీడీ తిరువాడిపురం శాత్తుమొరను వేడుకగా నిర్వహించింది.ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఆలయ వెనుకభాగంలోని పురుశైవారి తోటకు వేంచేశారు.నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా తిరిగి ఆలయానికి బయల్దేరారు. మార్గమధ్యంలో పొగడచెట్టుకు హారతి, పుష్పమాల, శఠారి సమర్పించారు. శఠారికి అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లు మాడవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు.ఆలయ పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**-తిరుమల, ఆంధ్రజ్యోతి**

## అంతరిక్షంపై అవగాహన పెంచుకోండి

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా బుధవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష ప్రయోగాలు, ఇస్రో రూపొందించే ఉపగ్రహాలను గురించి విద్యార్థులకు షార్ డైరెక్టర్ వివరించారు. సమాజం కోసం ఇస్రో చేపడుతున్న ప్రయోగాలు, కార్యక్రమాల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం అంతరిక్ష ప్రయోగాల గురించి చంద్రయాన్-3 అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కల్పన చంద్రయాన్ వివరించారు.శాస్త్రవేత్తలు రఘురామ్, శంభుప్రసాద్, సీవీఎస్ కిరణ్, షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**- సూళ్లూరుపేట**



సమావేశంలో ప్రసంగిస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

# రక్తమోడిన తిరుమల ఘాట్

**● బస్సు కిందపడి ఇద్దరు తమిళనాడువాసుల దుర్మరణం**



బస్సు కింద సౌమ్య, పక్కన కార్తీక్ మృతదేహాలు

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ప్రకృతి అందాల నడుమ దర్శనమిచ్చే తిరుమల ఘాట్‌రోడ్డు బుధవారం మధ్యాహ్నం రక్తపు మరకలతో భయానకంగా మారింది. స్వామి క్షేత్రానికి చేరుకున్నామని ఆనందపడుతున్న భక్తులను ఆగిన బస్సు, దాని కింద రెండు మృతదేహాలు ఆందోళనకు గురిచేశాయి.మొదటిఘాట్ రోడ్డులోని చివరి మలుపు అంటే తిరుమలకు జీఎన్సీ టోల్‌గేట్‌కు సమీప ప్రాంతంలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడు, యువతి బైక్‌పై ప్రయాణిస్తూ ముందు వెళుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాల వద్ద లభించిన గుర్తింపుకార్డుల ఆధారంగా బైక్ నడుపుతున్న వ్యక్తి తమిళనాడులోని పల్లిపట్టు తాలూకా వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28)గా తేలింది. ఇక, వెనుకభాగంలో కూర్చుని మృతి చెందిన మహిళ తిరువన్నామలై జిల్లాలోని చెంజాం తాలూకా, మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా పోలీసులు గుర్తించారు. ఉదయం 10.45 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా, మధ్యాహ్నం తర్వాత మృతదేహాలను పోలీసులు, హెల్త్ సిబ్బంది బస్సు కింద నుంచి తొలగించి అశ్విని ఆస్పత్రికి తరలించారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ సంఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం గురించి ఆరా తీశారు. ప్రమాదం జరిగిన నేపథ్యంలో బస్సు డ్రైవర్ కాంతారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిం
దనే అంశాలపై ఆరా తీస్తున్నారు.కాంతారావు మీడియాతో మాట్లాడుతూ.. బైక్‌పై వచ్చిన వారు తొలుత రైట్‌లో వచ్చేందుకు ప్రయత్నించి తర్వాత వేగంగా ఎడమవైపుకు వచ్చారని తెలిపారు. కనీసం హార్న్ కూడా కొట్టలేదని, బస్సును ఢీకొట్టి వారే కిందకు వెళ్లిపోయారన్నారు. మలుపు కావడంతో బస్సును వేగంగా కూడా నడపలేదని, బైక్‌పై వచ్చిన వారే మితిమీరిన వేగంతో వచ్చారని వివరించాడు. బస్సు ప్రమాదానికి కారణం ఎవరనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా కొద్దిరోజులుగా ఏసీ బస్సులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ముందు వెళుతున్న కార్లను, ద్విచక్రవాహనాలను సైతం ఓవర్‌టేక్ చేస్తున్నాయనే ఫిర్యాదులున్నాయి. భక్తుల కార్లతో పాటు టీటీడీ అధికారుల వాహనాలకు కూడా సైడ్ ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి.పర్యావరణ పరిరక్షణ నినాదంతో తిరుమల-తిరుపతి మధ్య ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 62 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. వీటి డ్రైవర్లను బస్సు తయారీ సంస్థ అవుట్‌సోర్సింగ్ ద్వారా నియమించుకుంది. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినప్పటికీ ర్యాష్ డ్రైవింగ్‌తో విమర్శలపాలవుతున్నారు. ఈ అంశంపై ఆంధ్రజ్యోతిలో గతనెల 11వ తేదీన 'తిరుమల ఘాట్‌లో ఏసీ బస్సుల దూకుడు' అనే శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది. అయినప్పటికీ వారి తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.ఎలక్ట్రిక్ బస్సులన్నిటికీ ముందు, వెనుకభాగంలో సీసీ కెమెరాలున్నప్పటికీ వాటిని ఆన్ చేయకుండా బస్సులు నడుపుతున్నట్టు బుధవారం జరిగిన ఘటనతో వెలుగు చూసింది.



బస్సు డ్రైవరును విచారిస్తున్న పోలీసులు

## భాకరాపేట ఘాట్‌లో నడిరోడ్డుపై లారీ బోల్తా

చంద్రగిరి ఆగస్టు 7: చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్‌లో బుధవారం సాయంత్రం నడిరోడ్డుపై ఓ లారీ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి.వరదయ్య పాళెం మండలం కలత్తూరుకు చెందిన 11మంది వ్యాపారులు, కూలీలు ఎర్రావారిపాళ్యం మండలం వెళ్లారు.ఆ మండలంలోని పలు గ్రామాల్లో వరిధాన్యం సేకరించి లారీలో వేసుకొని వస్తుండగా భాకరాపేట ఘాట్‌లో అదుపుతప్పి రోడ్డుపై లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవీన్ కుమార్(27) అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లయ్య, మునిభూషణం, మణి, బాలయ్య గాయపడ్డారు. నవీన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన లారీ (ఇన్‌సెట్‌లో) నవీన్ కుమార్ మృతదేహం

## తిరుపతి కేంద్రంగా మరో డీసీసీబీ

**● శాఖలు, సింగిల్ విండోలు కూడా**



చిత్తూరు డీసీసీబీ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: జిల్లాల పునర్విభజన నేపథ్యంలో డీసీసీబీ(జిల్లా సహకార కేంద్ర బ్యాంకు)లనూ విభజించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో చిత్తూరు డీసీసీబీని విభజించి తిరుపతి కేంద్రంగా మరొకటి ఏర్పాటు కానుంది. కొన్ని సింగిల్ విండోలు, శాఖలు అన్నమయ్య జిల్లాలో కలవనున్నాయి. అమరావతిలో ఇటీవల జరిగిన డీసీసీబీ సీఈవోల సమావేశంలో ఉన్నతాధికారులు ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. 105 సంవత్సరాల చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ప్రధాన కార్యాలయంతో కలిపి 20 శాఖలు, 75 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్ విండోలు) ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2940 కోట్ల వ్యాపారం నిర్వహిస్తూ రాష్ట్రస్థాయిలో చిత్తూరు డీసీసీబీ ఏడో స్థానంలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించినా డీసీసీబీ మాత్రం ఇప్పటికీ ఉమ్మడిగానే కొనసాగుతోంది. దీనినీ విభజించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ శాఖలను, సింగిల్ విండోలను కూడా జిల్లాలవారీగా విభజించనున్నారు. ఈ ఏడాది ఆఖరిలోగా విభజన ప్రక్రియను పూర్తిచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వాస్తవానికి ఇదివరకే డీసీసీబీ పాలకవర్గాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ముగిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో చిత్తూరు జిల్లా డీసీసీబీకి పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఈయన డిసెంబరు వరకు కొనసాగనున్నారు. ఆలోగా బ్యాంకు విభజన ప్రక్రియ పూర్తిచేసి సింగిల్ విండోలకు, డీసీసీబీలకు ఎన్నికలు నిర్వహించాలా? లేక నామినేటెడ్ పద్ధతుల్లో త్రిసభ్య లేదా ఏడుగురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించాలా అన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

### తిరుపతి డీసీసీబీకి 14 శాఖలు, 23 విండోలు

విభజన నేపథ్యంలో చిత్తూరులోని ప్రధాన కార్యాలయంతో కలిసి 20శాఖలు, 37 సింగిల్ విండోలతో చిత్తూరు డీసీసీబీ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసే తిరుపతి జిల్లా డీసీసీబీలో 14 శాఖలు, 23 సింగిల్ విండోలు ఉంటాయి. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లాకు ఆరు శాఖలు, 15 సింగిల్ విండోలు విలీనం కానున్నాయి. విభజనపై సాధక బాధకాలను ఉన్నతాధికారులు త్వరలో పరిశీలించనున్నట్లు తెలిసింది.

# స్కూళ్లలో ఎన్నికల వేడి

## 2334ప్రభుత్వ పాఠశాలల్లో నేడు యాజమాన్య కమిటీల ఎన్నికలు

### ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు



తిరుపతి(విద్య), ఆగస్టు 7: ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు నేడు జరుగనున్నాయి.జిల్లాలోని 34 మండలాల్లో వున్న 1817 ప్రైమరీ పాఠశాలలు, 194 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 323 హైస్కూళ్లతో కలుపుకుని మొత్తం 2334 పాఠశాలల్లో యాజమాన్య ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. ఆగస్టు ఒకటిన ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.ఎన్నికైన కమిటీలు రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఎన్నికలు పూర్తిగా రాజకీయ కోణంతో ఏకపక్షంగా జరిగిన విషయం తెలిసిందే. ఈసారి అలాంటి పొరబాట్లకు అవకాశం లేకుండా పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి సేవా భావంతో కృషి చేసేవారికి ప్రాధాన్యం ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేశామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తల్లిదండ్రుల కమిటీలుగా వ్యవహరించిన వీటి పేరును పాఠశాల యాజమాన్య కమిటీలుగా మారుస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

### వైసీపీ హయాంలో

పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలు గతంలో 2021 సెప్టెంబరు 22న జరిగాయి. ఆ కమిటీల పదవీకాలం గతేడాది సెప్టెంబరుతో ముగిసింది. ఐతే అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ కమిటీలను మరో ఏడాదిపాటు పొడిగించింది. దీంతో అప్పటి కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలై 31వ తేదీతో ముగిసింది. దీంతో తాజాగా కొత్త కమిటీల ఎంపికకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల నిబంధనలను పట్టించుకోకుండా ఆ పార్టీ నాయకులకు నచ్చినవారిని ఎంపిక చేసుకున్నారు. ఈసారి అలాంటివి జరగరాదని, అలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం విద్యాశాఖాధికారులను హెచ్చరించింది.

### నేటి సాయంత్రం తొలి సమావేశం

విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల భాగస్వామ్యంతో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేస్తారు. తరగతుల నిర్వహణ, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తదితరాలను ఈ కమిటీలు పర్యవేక్షిస్తాయి. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాలను పాఠశాలల్లో అందుబాటులో ఉంచి అభ్యంతరాలను తెలియజేసేందుకు ఈనెల 5వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారు.ఈ 15మంది సభ్యుల నుంచి అదేరోజు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఎంపిక చేస్తారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల వారికి కమిటీల్లో ప్రాధాన్యం ఉంటుంది.ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉంటారు. ఎన్నికల ప్రక్రియను ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల అధికారులు పర్యవేక్షిస్తారు.గురువారం ఉదయం7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు కమిటీ సభ్యులచే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ల ప్రమాణస్వీకారం, 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది.

## వలంటీర్ల వాట్సప్ గ్రూపుల తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7: గ్రామ, వార్డు వలంటీర్లు (విధుల్లో ఉన్న.. రాజీనామా చేసిన.. తొలగించిన)కు సంబంధించి వారి హౌస్‌హోల్డ్స్ పరిధిలో ప్రజలతో ఏర్పాటు చేసుకున్న వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులన్నిటినీ వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీఅయ్యాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన వలంటీర్ల వ్యవస్థకు ఎటువంటి బాధ్యతలను కూటమి ప్రభుత్వం అప్పగించలేదు. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను వెంటనే డిలీట్ చేయడంతో పాటు సంబంధిత సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ సమాచారాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు చేరవేయాలని కూడా అందులో పేర్కొన్నారు. గతంలో వలంటీర్ల ద్వారా పెన్షన్లను వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు నెలలకు సంబంధించిన పెన్షన్లను వలంటీర్లు లేకుండానే సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులతో పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# చేనేతలకు సబ్సిడీలు పునరుద్ధరిస్తాం

**● కలెక్టర్ వెంకటేశ్వర్**

వెంకటగిరి, ఆగస్టు 7:వ్యవసాయం తర్వాత ఎక్కువమంది ఆధారపడ్డ చేనేతరంగం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరిలోని పద్మశాలీయుల కళ్యాణ మండపంలో బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందిన వెంకటగిరి జరీచీరలకు రాన్రానూ డిమాండ్ తగ్గిందన్నారు.పవర్‌మిల్స్ రావడంతో పాటు అక్కడ తయారైన వస్త్రాలకు ఎక్కువ పబ్లిసిటీ ఇవ్వడం అందుకు కారణమన్నారు.వెంకటగిరిలో వర్షాల వల్ల రెండు మూడు నెలలు చేనేత పనులు స్తంభించడంతో నేత కార్మికులు ఇబ్బంది పడుతున్నారని స్థానిక శాసనసభ్యుడు తన దృష్టికి తీసుకు వచ్చారని చెప్పారు. ఇందుకోసం సీసీ రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తామన్నారు.వెంకటగిరిలోని 7 చేనేత సహకారసంఘాల వివరాలు తెప్పించుకుని వాటిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు.చేనేతలకు సబ్సిడీలను పునరుద్ధరించేందుకు బ్యాంకు అధికారులతో చర్చిస్తామన్నారు. టిడ్కో గృహాల్లో మగ్గాలు ఏర్పాటు చేసుకోలేకపోతున్నామని చేనేతలు వాపోతున్న దృష్ట్యా వారికి ప్రత్యామ్నాయం చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ చేనేత రంగాన్ని ఆదుకునేందుకు వారంలో ఒకరోజు ప్రతి ఒక్కరూ నేత కార్మికులు నేసిన దుస్తులు ధరించాలని సూచించారు.అనంతరం 60యేండ్లు దాటిన 10మంది చేనేత కార్మికులను సన్మానించారు.వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ,కమిషనర్ రషీద్, చేనేత యూనియన్ నేతలు అవ్వారు సత్యం, గంగాధర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు,మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, గౌరాబత్తిన చెంచయ్య, సామల లక్ష్మీపతి, హ్యాండ్‌లూమ్ ఏడీ విచ్చేశ్వరావు, ఐఏహెచ్‌టీ ప్రిన్సిపాల్ గిరిధరరావు, వీవర్స్ సర్వీసు సెంటర్ ఇన్‌చార్జి విశ్వనాథం తదితరులు వున్నారు.అంతకుముందుగా క్రాస్ రోడ్డులో ఐఐహెచ్‌టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



చేనేత కార్మికుడు బోడా సిద్ధయ్యకు సన్మానం

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## భారీ వర్షానికి నేలకొరిగిన వరిపైరు


నేలకొరిగిన వరిపైరును పరిశీలిస్తున్న అనిత

తడ, ఆగస్టు 7: మంగళవారం కురిసిన భారీ వర్షానికి వెండ్లూరుపాడు, మాంబట్టు పంచాయతీలోని వరిపైరు నేలకొరిగింది. పొట్టదశలో ఉన్న వరిపైరు నేలకొరగడంతో రైతులు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం వ్యవసాయశాఖ ఏడీఏ అనిత సంబంధిత పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఈ రెండు పంచాయతీలలో మొత్తం 305 ఎకరాలలో వరిపైరు సాగుచేస్తున్నారని, అందులో 150 ఎకరాలపైరు మంగళవారం కురిసిన వర్షానికి నేలకొరిగిందన్నారు. వేనాడు, కాదలూరులలో నెల క్రితం పైరు మాత్రమే సాగులో ఉండటంతో వాటికి ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. నష్టాల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఏవో కాంచన కూడా ఉన్నారు.

## దేశాభివృద్ధికి యువత పునాది



మాట్లాడుతున్న న్యాయమూర్తి లోకనాథం

గూడూరు, ఆగస్టు 7: దేశాభివృద్ధికి యువత పునాదిలాంటివారని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని న్యాయమూర్తి లోకనాథం సూచించారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసైతే జీవితాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఉన్నత ఆశయంతో సాంకేతికంగా అభివృద్ధి మార్గంలో పయనించి దేశానికి మార్గదర్శకులుగా నిలవాలన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రవిప్రసాద్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సు


మాట్లాడుతున్న జడ్జి భరత్‌కమల్, న్యాయవాదులు

కోట, ఆగస్టు 7: మండల పరిధిలోని విద్యానగర్ శ్రీనివాస జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాల పట్ల అవగాహనలేకపోతే కలిగే నష్టాలను వివరించారు. ఎస్‌ఐ నాగరాజు, పలువురు న్యాయవాదులు, విద్యార్థులు ప్రస్తుత సమాజంలో నేర్చుకోవాల్సిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ వెంకటరమణమూర్తి, న్యాయవాదులు అత్తికాయల మోహన్, బాబురెడ్డి, రమణ, అశోక్ తదితరులు ఉన్నారు.

## బ్రిడ్జిని నిర్మించకుంటే సచివాలయ భవనానికి ప్రమాదం

తడ, ఆగస్టు 7: పెరియవట్టు వద్ద నిర్మిస్తూ అర్ధాంతరంగా నిలిపివేసిన బాక్స్‌టైపు బ్రిడ్జిని త్వరితగతిన పూర్తిచేయకుంటే పక్కనే ఉన్న సచివాలయ భవనానికి ముప్పు పొంచి ఉందని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని అన్నారు. బుధవారం పెరియవట్టు వద్ద అర్ధాంతరంగా ఆగిపోయిన రైల్వే బాక్స్‌టైపు బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. పరిస్థితిని గమనించి అప్పటికప్పుడే చెన్నై సదరన్ రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ పరిస్థితిని వివరించారు. ఏడాదిగా నిర్మాణాన్ని అర్ధాంతరంగా వదిలేశారని, అందుకోసం తీసిన గుంతలకు పక్కన ఉన్న మట్టి అంతా కరిగిపోతుందని, పక్కనే ఉన్న సచివాలయ భవనానికి ముప్పు ఉందని ఆయన తెలిపారు. ఈ సమస్యపై గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేశారని చెప్పారు. దీంతో స్పందించిన రైల్వే అధికారులు వారంలోపు పనులు మొదలుపెట్టి, వీలైనంత త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీవో వెంట ఎంపీడీవో విజయకుమార్, డిప్యూటీ తహసీల్దారు శరత్, తదితరులు ఉన్నారు.

## ప్రగడ కోటయ్య చిరస్మరణీయుడు


నివాళులు అర్పిస్తున్న చేనేత కళాకారులు

వెంకటగిరిటౌన్, ఆగస్టు 7: చేనేత ఉద్యమ నేత ప్రగడ కోటయ్య చేనేతల్లో చిరస్మరణీయుడిగా నిలిపోయారని రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఐఐహెచ్‌టీలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు కోటయ్య కృషి చేశారన్నారు. ప్రజాబంధుగా ఆయనకు బిరుదు ఉందని కొనియాడారు. చేనేత అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఐఐహెచ్‌టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శ్రేష్ఠమైనవి



ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

గూడూరు, ఆగస్టు 7: తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని డాక్టర్ మైథిలి అన్నారు. బుధవారం మైథిలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, స్థానిక ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వలన పుట్టిన బిడ్డలు ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఎల్ రమణబాబు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు


తల్లిపాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు

కోట ఆగస్టు 7: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వారం రోజుల పాటు జరిగిన తల్లిపాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మల ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ చివరి రోజు వంజివాక, చెందోడు గ్రామాల్లో తల్లులు, ఐసీడీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## పంచాయతీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పెళ్లకూరు, ఆగస్టు 7: మండలంలోని దిగువ చావాలిలో పంచాయతీ స్థలం ఆక్రమణతో పాటు గ్రామ పంచాయతీ భవనం కిటికీ సన్‌సైడ్ బండలను ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన నింద్ర భూపయ్య పంచాయతీ భవనం కిటికీ సన్‌సైడ్ బండలను ధ్వంసం చేయడంతోపాటు పంచాయతీ స్థలాన్ని కూడా ఆక్రమించాడని శ్రీహరి తెలిపారు. పంచాయతీ భవనాన్ని నష్టపరిచిన భూపయ్యపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

## విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

తడ, ఆగస్టు 7: తడ కొత్తకుప్పం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. స్థానిక టీసీఐఎన్ పరిశ్రమ వీటిని సమకూర్చగా, ఎంఈవోలు సరస్వతి, మల్లికార్జున్‌రావులు వీటిని బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ డైరెక్టర్ సెందిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పలకల పంపిణీ



గూడూరు అర్బన్, ఆగస్టు 7: స్థానిక జీఎస్‌రాయల్ మున్సిపల్ హైస్కూల్‌లోని ఉర్దూ పాఠశాలలో బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్ మాట్లాడుతూ చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బషీరున్నీసాబేగం, సురేంద్రబాబు, ఆరీఫ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గూడూరు అర్బన్, ఆగస్టు 7: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన మండలంలోని చెన్నూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అనూషను బుధవారం ప్రధానోపాధ్యాయురాలు మముల్లాజాన్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన అనూష అండర్-17 హ్యాండ్‌బాల్, జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి, స్పోర్ట్ కోటాలో ఎంపికైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి చేయూత


సమావేశంలో పాల్గొన్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, ఆగస్టు 7: పేద విద్యార్థుల చదువుల కోసం ఎస్వీ రత్నం చారిటీస్ చేయూతనందిస్తుందని చారిటీస్ నిర్వాహకుడు, చార్టెడ్ అకౌంటెంట్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. బుధవారం స్థానిక త్యాగరాజవీధిలోని సంస్థ కార్యాలయంలో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల చదువుల కోసం రూ.1,07,000 ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ... పేదవిద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వలన చదువు నిలిపివేయకుండా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, బొమిడి శ్రీనివాసులు, గిరిబాబు, సనత్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఎల్‌ఎన్‌బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాకాడు తహసీల్దార్‌గా రామయ్య

వాకాడు, ఆగస్టు 7: మండల నూతన తహసీల్దార్‌గా రామయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెళ్లకూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై వాకాడుకు వచ్చారు. వాకాడులో విధులు నిర్వహిస్తున్న నరసింహారావు సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. తహసీల్దార్ రామయ్యకు డీటీ సందీప్, ఆర్‌ఐ సెల్వరాజ్, రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి స్వాగతం పలికారు.

## బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

దొరవారిసత్రం, ఆగస్టు 7: దొరవారిసత్రం తహసీల్దార్‌గా పి.సైలాకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె విడవలూరు నుంచి బదిలీపై విచ్చేసి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ అయిన ఆమెను అడహక్ తహసీల్దార్‌గా కలెక్టరు నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ ఉద్యోగులతో పాటు, మండల టీడీపీ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు.

## కోట తహసీల్దార్‌గా జయజయరావు

కోట, ఆగస్టు 7: కోట తహసీల్దార్‌గా జయజయరావు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. తడ మండల తహసీల్దారుగా పనిచేస్తున్న జయజయరావును కోటకు బదిలీ చేయగా, ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది, పలువురు అధికారులు తహసీల్దార్‌ను అభినందించారు.

## బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

సూళ్లూరుపేట, ఆగస్టు 7: సూళ్లూరుపేట తహసీల్దార్‌గా ఎస్వీ నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు వచ్చిన తహశీల్దార్ బదిలీపై గుంటూరుకు వెళ్లడంతో వాకాడు తహశీల్దార్‌గా పనిచేస్తున్న నరసింహారావును సూళ్లూరుపేటకు నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు తీసుకొన్నారు.

## చేనేతలను ఆదుకోండి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాధవ నాయుడు, రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 7: వెంకటగిరి చేనేతలను అన్ని విధాల ఆదుకోవాలని అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలెక్టరు వెంకటేశ్వర్‌ను కోరారు. బుధవారం వెంకటగిరిలో ఏర్పాటు చేసిన చేనేత దినోత్సవ సభకు హాజరయ్యేందుకు వచ్చిన కలెక్టరును వారు ముందుగా తెలుగుగంగ అతిథి గృహంలో కలుసుకొన్నారు. ఈ సందర్భంగా హ్యాడ్‌లూమ్ టెక్నాలజీ విద్యార్థులు నిర్వహించిన చేనేత దినోత్సవ ర్యాలీలో వారు పాల్గొన్నారు. కలెక్టర్‌ను, ఎమ్మెల్యేని ఐఐహెచ్‌టీ ప్రిన్సిపాల్ గిరధరరావు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## ప్రమాదానికి గురైన 108 వాహనం

గూడూరు అర్బన్, ఆగస్టు 7: స్థానిక సాయిబాబాగుడి సమీపంలో బుధవారం వేకువజామున 108 వాహనం ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. గూడూరు వైపు నుంచి జాతీయరహదారి వైపు వెళుతున్న 108 వాహనం సాయిబాబాగుడి సమీపంలో గేదెను ఢీకొనడంతో, వాహనం ముందుభాగం దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

# పుట్టిన గడ్డను మరవను

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ


ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న వెంపటి మాధవ నాయుడు

డక్కిలి, ఆగస్టు 7: పుట్టిన గడ్డను ఊపిరి ఉన్నంతవరకు మర్చిపోనని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ సొంతూరైన డక్కిలి మండలం పాతనాలపాడులో బుధవారం గ్రామస్తులు విజయోత్స సభ నిర్వహించగా, ఎమ్మెల్యే సతీమణి సింధు, కుమార్తె లక్ష్మీసాయి ప్రియలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. వెంకటగిరి నుంచి తనను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. దివంగత నేత రాపూరు మాజీ ఎమ్మెల్యే నువ్వుల వెంకటరత్నం నాయుడు రాజకీయాల్లో తనకు ఆదర్శమన్నారు. అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణ నిత్యశ్రామికుడని, అందుకే ఆయన్ను ఇప్పటికీ ఇక్కడి ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులను యువత గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, నాయకులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, సీసీ నాయుడు, తిరుపతి సింధూరపార్కు అధినేత వెంకయ్య, రావి మస్తాన్ నాయుడు, సత్యం, వేమాను యువరాజ్, కురుగొండ్ల శ్రీనివాసులు, సురేంద్ర, నల్లాని రామచంద్రయ్య, మురళి, జయచంద్ర, రాజేంద్ర, రాజా, చందు, రాంబాబు, గట్టుమనేని వెంకటరమణ, నరసయ్య నాయుడు, అధికారులు తదితరులు ఉన్నారు.

**కమ్మవారిపల్లిని దత్తత తీసుకొంటా: కురుగొండ్ల సింధు**

కమ్మవారిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సతీమణి సింధు ప్రకటించారు. టీడీపీ విజయోత్సవ సభకు హాజరైన ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తన భర్త కురుగొండ్ల రామకృష్ణ జన్మించిన కమ్మవారిపల్లి(పాతనాలపాడు) గ్రామంలో మౌళిక వసతులు కల్పించడంతో పాటు జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు నేనే బాధ్యత తీసుకొంటానని ఆమె ప్రకటించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

## నేటి నుంచి విద్యాకమిటీ చైర్మన్‌ల ఎన్నిక

● గోవిందపల్లి, కేశవరం, సిద్ధమ్మకండ్రిగ పాఠశాలకు పోలీస్ బలగాలు..?

కోట, ఆగస్టు 7: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం విద్యాకమిటీ ఎన్నికలు జరగనున్నాయి. చేతులెత్తే విధానం ద్వారా ఆయా విద్యాకమిటీ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. అటు అధికార టీడీపీ, ఇటు వైసీపీ నాయకులకు ఈ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ప్రతిష్టాత్మకంగా మారనుంది. మండలంలోని 21 పంచాయతీలకు గాను 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితోపాటు మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, చిట్టేడులోని యానాదుల బాలుర గురుకులం, కోటలోని యానాదుల బాలికల గురుకుల పాఠశాలలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఆయా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో సుమారు 6వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి పేరెంట్స్ ఈ ఎన్నికల్లో చేతులెత్తే విధానం ద్వారా చైర్మన్‌లను ఎన్నుకోనున్నారు. కోట మండలంలో కేశవరం, రామవాపురం, సిద్ధమ్మకండ్రిగ, గోవిందపల్లి పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు ప్రతిష్టాత్మకం కానున్నాయి. టీడీపీ, వైసీపీల నేతలు నువ్వా నేనా అన్న చందాన స్థానిక సంస్థల ఎన్నికల మాదిరిగా పేరెంట్స్‌ను కలిసి ఆయా పాఠశాలలకు హామీల వర్షం కురిపిస్తున్నారు. పోలీసులు సమస్యాత్మక పాఠశాలలపై డేగ కన్ను వేశారు.

## గోదాదేవికి అభిషేకం



సూళ్లూరుపేట, ఆగస్టు 7: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి జన్మనక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ తెలిపారు. ముందుగా గోదాదేవి ఉత్సవమూర్తిని ఆలయ ప్రాంగణంలో కొలువు దీర్చి కలశాలతో జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. గాదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాపా మల్లయ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# 15న అన్నక్యాంటీన్ ప్రారంభానికి ఏర్పాట్లు


గూడూరులో సిద్ధం చేస్తున్న అన్నక్యాంటీన్ భవనం - నాయుడుపేటలో పరిశీలిస్తున్న కమిషనర్

గూడూరు, ఆగస్టు 7: గత టీడీపీ ప్రభుత్వంలో పేదలందరూ మూడుపూటలా కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశ్యంతో స్థానిక పాత బస్టాండు సమీపంలో అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఎంతో మంది పేదలకు నామ మాత్రపు నగదుతో కడుపులు నింపింది. ఈ అన్నక్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేసి, ఆ భవనంలో సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దీంతో పేదల నోటి దగ్గర కూడును వైసీపీ ప్రభుత్వం లాగి వేసిందన్న విమర్శలు వచ్చాయి. ఇటీవల ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను తిరిగి పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు, ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించేలా ఫైల్‌పై సంతకం చేశారు. దీంతో పట్టణంలోని అన్నక్యాంటీన్ భవనంలో ఉన్న సచివాలయాన్ని మరో ప్రాంతానికి తరలించి, అన్నక్యాంటీన్‌ను తిరిగి సిద్ధం చేసేలా మున్సిపల్ అధికారులు పనులు వేగవంతంగా చేపడుతున్నారు. ఈ నెల 15వ తేదీన అన్నక్యాంటీన్‌ను ప్రారంభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు.

**నాయుడుపేట:** ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వంలో సచివాలయంగా మార్చివేశారు. ప్రస్తుతం అన్న క్యాంటీన్‌లో ఉన్న సచివాలయాన్ని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుటకు తరలించారు. పాత అన్న క్యాంటీన్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి స్థానికులతో పాటు నాయుడుపేటకు వచ్చే వివిధ ప్రాంతాల ప్రజలకు కూడా భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ ఖాజామొహిద్దీన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 7: నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజవకర్గ పరిధిలోని వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధిపనుల వివరాలను వెంటనే అందజేయాలన్నారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో రైతులు గోకులాలు, మినీ షెడ్లు నిర్మించుకున్నారని, వాటికి బిల్లులు త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి పనులు జరగలేదని, ఈ ప్రభుత్వంలో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, కిషోర్ నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, చెంచురామయ్య, మట్టం శ్రావణి, లీలావతి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధుల పట్ల అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఓజిలి, ఆగస్టు 7: తరచుగా వానలు కురుస్తున్న క్రమంలో అంటువ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఓజిలి మండలం అత్తివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు అన్నారు. ఓజిలి మండలం పున్నేపల్లిలో బుధవారం గ్రామస్తులు, సంఘబంధం సభ్యులకు అంటువ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు స్వచ్ఛమైన నీటిని తాగటం ద్వారా అంటు వ్యాధులను అడ్డుకోవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో అత్తివరం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి రాజగోపాల్, చిన్నయ్య, వైద్యసిబ్బంది ఝాన్సీ, మల్లీశ్వరి,జ్యోతి, ఆశావర్కర్ సిద్ధమ్మ పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండ


చేనేతల సమస్యలను తెలుసుకుంటున్న జనసేన నాయకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 7: అంతరించిపోతున్న చేనేత కళ, కార్మికులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నూరులో చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకుని వారిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బాలాజీ, వెంకటేష్, బాలసుబ్రమణ్యం, శివకుమార్, క్రాంతి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రణవ బ్రహ్మసూత్ర ఈశ్వర ఆలయ పునర్నిర్మాణం

నాయుడుపేట, ఆగస్టు 7: నాయుడుపేట మండలం పుదూరు గ్రామ శివారులో వెలసి ఉన్న శివాలయం ఈశాన్యభాగాన ఉన్న ప్రణవ బ్రహ్మసూత్ర ఈశ్వర ఆలయం ఆగస్టు 9వ తేదీ పునర్నిర్మాణం జరుగుతుందని గ్రామపెద్దలు బుధవారం తెలిపారు. ఇటీవల ఈ ఆలయం చదునుకావడంతో అదే ప్రదేశంలో దాదాపు రూ.36 లక్షలతో పునర్నిర్మాణం పనులు చేపడుతున్నట్లు చెప్పారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ నిర్మాణానికి తోడ్పాడాలని కోరారు. సెల్ 88010 09247 నెంబరుకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం చేయవచ్చన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు


డ్రైనేజీకాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, టీడీపీ నేతలు

చిల్లకూరు, ఆగస్టు 7: మండల కేంద్రమైన చిల్లకూరులో నెలకొన్న సమస్యలను త్వరిగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, నాయకులతో కలిసి గ్రామంలోని దళితవాడలు, మిక్సిడ్‌కాలనీ, శంకరన్ గిరిజనకాలనీ తదితర ప్రాంతాలను పరిశీలించి స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, బెల్లంకొండ రాజేంద్ర, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కారూరులో మారియమ్మన్ జాతర


అంబళ్లను సమర్పిస్తున్న భక్తులు

తడ, ఆగస్టు 7: మండల పరిధిలోని కారూరు గ్రామదేవత మారియమ్మన్ జాతర బుధవారం మొదలైంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో జాతర చాటింపు వేయగా, ఉదయం గ్రామస్తులు పొంగళ్లు, అంబళ్లతో ఊరేగింపుగా మారియమ్మన్ గుడికి తరలివెళ్లారు. అక్కడ అమ్మణ్ణికి సమర్పించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మకు పొంగళ్లను పొంగించి, నైవేద్యంగా సమర్పించారు. అర్ధరాత్రి నుంచి అమ్మణ్ణి గ్రామోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కంపేటలో గ్రామదేవత పోలేరమ్మకు జాతర నిర్వహించారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తుల వితరణ



నాయుడుపేట టౌన్, ఆగస్టు 7: నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న 114 మంది పారిశుధ్య కార్మికులకు, స్వర్గధామంలో పనిచేస్తున్న ఏడుగురికి దుస్తులను ఎస్‌ఆర్‌ఐ విజయప్రభ - శ్రీనివాసులురెడ్డి దంపతులు వితరణ చేశారు. నంద జగదీష్‌కుమార్ 3వ వర్ధంతి సందర్భంగా పారిశుధ్య, స్వర్గధామ కార్మికులకు దుస్తులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న 38 మందికి ఆగస్టు 15వ తేదీ ట్రీనిటీ సూపర్ స్పెషాలిటీ చైర్మన్ ఆదవరం నాగూరయ్య దుస్తులను అందజేయనున్నట్లు ప్రకటించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఉదయశంకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, మునగాల కృష్ణారావు, బట్టా సుబ్రహ్మణ్యం, హెచ్ సుబ్రహ్మణ్యం, శశిధర్, ప్రమీలమ్మ, జయమ్మ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ


పరామర్శిస్తున్న వేనాటి రామచంద్రా రెడ్డి

సూళ్లూరుపేట, ఆగస్టు 7: ఇటీవల మృతి చెందిన సూళ్లూరుపేట మండలం కుదిరి సర్పంచ్ బుంగా చెంగయ్య కుటుంబ సభ్యులను బుధవారం మాజీ టీటీడీ బోర్డు సభ్యులు, వైసీపీ నేత వేనాటి రామచంద్రారెడ్డి పరామర్శించారు. కుదిరిలోని వారి ఇంటికి వెళ్లి మృతికి గల కారణాలడిగి తెలుసుకొన్నారు. సర్పంచ్ చెంగయ్య మృతి బాధాకరమన్నారు.